http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 3 మే 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# రేపు తెలంగాణ కేబినెట్ భేటీ

- పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటీ కానున్న రాష్ట్ర మంత్రివర్గం
- ఉద్యోగులు, ఫించనర్ల సమస్యలు, డిమాండ్లపై మంత్రి మండలి చర్చించనున్నట్లుగా తెలుస్తోంది.
- రేపు మధ్యాహ్నం మూడు గంటలకు సచివాలయంలో సమావేశం
- పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం



హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గం ఎల్లుండి సమావేశం కానుంది. సచివాలయంలో ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై కేబినెట్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు నాలుగు మార్గాలు ప్రతిపాదనలో ఉన్నాయి. వీటిపై కేబినెట్ చర్చించి, నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఉద్యోగులు, ఫించనర్ల సమస్యలు, డిమాండ్లపై మంత్రి మండలి చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. ఉద్యోగులు, పింఛనర్ల పెండింగ్ బిల్లులు 100 రోజుల్లో క్లియర్ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, అందుకు సంబంధించిన కార్యాచరణపై కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోనుంది. పెండింగ్ డీఏలు, ప్రభుత్వం నగదు రహిత చికిత్సలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కొత్త ఆసరా ఫించన్లు, తెలంగాణ ఉద్యమకారుల కోసం కార్యక్రమాలు, ఇందిరమ్మ బీమా పథకం తదితర అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. - మిగతా3లో



# 10 న ప్రధాని తెలంగాణ పర్యటన

- మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన రాష్ట్రానికి రావడం ఇదే తొలిసారి.
- ఈ పర్యటన సందర్భంగా సుమారు రూ. 7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు
- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు

మెదక్

మే 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు విచ్చేస్తున్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన రాష్ట్రానికి రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా సుమారు రూ. 7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు వెల్లడించారు. మెదక్ జిల్లా రామాయంపేట్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. రామచంద్రరావు మాట్లాడుతూ జహీరాబాద్లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ సిటీ, వరంగల్లో టెక్స్టైల్ పార్క్, పీఎం మిత్ర హ్యాండ్లూమ్ - మిగతా3లో




# ఇకపై విపత్తు సమయాల్లో అలెర్ట్ మెసేజ్

- ఒక్కసారిగా మోగిన మొబైల్స్
- సెల్ బ్రాడ్‌కాస్ట్‌ను ప్రారంభించిన కేంద్రం
- విపత్తు సమయాల్లో ప్రజలను అలెర్ట్ చేసేందుకు సెల్ బ్రాడ్ కాస్ట్‌ను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం

# 'జాబ్ క్యాలెండర్ ప్రకారం ఒక్క ఉద్యోగమైన భర్తీ చేశారా?'



- 'నిరుద్యోగులు నోటిఫికేషన్ వద్దంటున్నారని సీఎం రేవంత్ చెబుతున్నారు
- కానీ నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు
- రాహుల్ గాంధీని అశోక్ నగర్ తీసుకువచ్చి మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలని నమ్మించారు
- ఆనాడు నమ్మించి..నేడు వంచించడం కాంగ్రెస్ నైజం.
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్‌రావు.

సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందంటూ ధ్వజమెత్తారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్‌రావు. నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తుంటే.. సీఎం రేవంత్ మాత్రం ఆ నోటిఫికేషన్ వద్దంటున్నారని మండిపడ్డారు. శనివారం సిద్ధిపేట జిల్లా జిల్లా గ్రంధాలయంలో ఉద్యోగాలకు - మిగతా3లో

# బంగాల్‌లో 77 మంది పోలీసు అబ్జర్వర్ల నియామకం

- బంగాల్ ఓట్ల లెక్కింపు కోసం–అడిషనల్ కౌంటింగ్, పోలీస్ అబ్జర్వర్ల నియామకం
- పారదర్శకంగా బంగాల్ ఓట్ల లెక్కింపు జరపడం కోసమే!



# రికార్డు స్థాయిలో దాడులు పెరిగాయ్- అరెస్టులు తగ్గాయ్

- ఈడీ వార్షిక లెక్కలు ఇవే
- 2025–2026లో ఈడీ సోదాల సంఖ్య డబుల్
- 27 శాతం తగ్గిన అరెస్టులు
- రూ.81,422 కోట్లు విలువైన ఆస్తులు అటాచ్
- బాధితుల కోసం రూ.32,678 కోట్ల ఆస్తులు రిలీజ్

ఈడీ వార్షిక నివేదికలో కీలక అంశాలు



# మా లక్ష్యం సర్వోదయ తెలంగాణ

- సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు
- పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్యత అంశాలు
- రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపైన తెలంగాణ రక్షణ సేన మాట్లాడుతుంది. పోరాటం చేస్తుంది
- తెలంగాణ సాధించుకున్న తర్వాత మనం సర్వోదయ తెలంగాణ కావాలనుకున్నాం.
- తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం. వచ్చాం. అన్ని అడ్డంకులను దాటుకొని తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ ఫ్లాట్ ఫామ్‌ను ఏర్పాటు చేసుకున్నాం. 20 ఏళ్ల పాటు సాగిన తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థగా అలాగే కొనసాగుతుందని తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కవిత మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపైన తెలంగాణ రక్షణ సేన మాట్లాడుతుంది. పోరాటం చేస్తుంది. తెలంగాణ సాధించుకున్న తర్వాత మనం సర్వోదయ తెలంగాణ కావాలనుకున్నాం. ఇప్పుడు మేము సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా ముందుకు వస్తున్నాం. ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండటమే సర్వోదయ తెలంగాణ లక్ష్యం. - మిగతా3లో

# అసెంబ్లీ ఎన్నికల్లో 200కి పైగా స్థానాల్లో గెలుస్తాం

- ఎగ్జిట్ పోల్స్‌పై బంగాల్ సీఎం మమతా కీలక కామెంట్స్
- అసెంబ్లీ ఎన్నికల్లో 200 సీట్లకుపైగా స్థానాల్లో గెలిచి తీరుతాం
- 'టీఎంసీ కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడ్డారు'





# ఓట్ల లెక్కింపు విషయంలో ఈసీ నిర్ణయమే ఫైనల్

- మమతా సర్కార్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు
- బంగాల్‌లో ఓట్ల లెక్కింపులో కేవలం పీఎస్‌యూల ఉద్యోగులను నియమిస్తూ ఈసీ నిర్ణయం
- దీంతో మమత పిటిషన్
- ఈసీ నిర్ణయం నిబంధనలకు విరుద్ధంగా లేదంటూ సుప్రీం కోర్టు తీర్పు

# కవిత పార్టీలోకి వలసలు

- పార్టీ ప్రారంభించడానికి ముందే బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు.. కవితకు మద్దతు తెలిపారు.
- ఈ క్రమంలోనే తాజాగా మరో మాజీ మంత్రి బోడ జనార్దన్.. కల్వకుంట్ల కవితతో భేటీ
- సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తా : బోడ జనార్ధన్




హైదరాబాద్

కొత్తగా కల్వకుంట్ల కవిత ప్రారంభించిన పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీ ప్రారంభించిన కవితకు.. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీగా కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పార్టీ - మిగతా3లో

# అసెంబ్లీ ఎన్నికల్లో 200కి పైగా స్థానాల్లో గెలుస్తాం

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ(టీఎంసీ) 200 సీట్లకుపైగా గెలుచుకోవడం ఖాయమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే ప్రయత్నం తప్ప మరేమి కాదన్నారు. వారు, 2021, 2024లో అలాగే చేశారని, ఇప్పుడు మళ్లీ అదే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. శనివారం వర్చువల్‌గా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలపై మమత తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సమయంలో టీఎంసీ కార్యకర్తలపై కేంద్ర బలగాలు దౌర్జన్యాలకు పాల్పడ్డాయని అన్నారు. అలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న పార్టీ కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో అవిశ్రాంత పోరాడిన తమ కార్యకర్తలకు మమత అభినందనలు తెలిపారు.



**'దక్షిణ 24 పరగణాల జిల్లాలో రీపోలింగ్'**

మరోవైపు, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కొనసాగుతోంది. రెండో దశ పోలింగ్ సందర్భంగా డైమండ్? హార్బర్? నియోజకవర్గం పరిధిలోని ఫల్తా ప్రాంతంలోని కొన్ని బూత్‌లలో బీజేపీ అభ్యర్థికి ఓటు వేయకుండా అడ్డుకున్నారని బంగాల్ బీజేపీ సహ ఇన్‌ఛార్జి అమిత్ మాల్వీయా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం కొన్ని కేంద్రాల్లో మళ్లీ రీపోలింగ్ నిర్వహిస్తోంది. మగ్రహాట్ పశ్చిమ అసెంబ్లీ పరిధిలోని 11 పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు 72.5 శాతం పోలింగ్ నమోదైంది. డైమండ్ హార్బర్ అసెంబ్లీ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో 72.36 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 72.43 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

**పోలింగ్ బూత్ సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో భద్రత**

రీపోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ బూత్ సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) సిబ్బందిని భారీగా మోహరించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌ను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. కోల్‌కతాలోని ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి కూడా పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నారు.

**ఆసక్తికర అంచనాలతో ఎగ్జిట్ పోల్స్ విడుదల**

ఇదిలా ఉండగా, బంగాల్ ఎన్నికలపై విడుదలైన పలు ఎగ్జిట్ పోల్స్ ఆసక్తికర అంచనాలను వెల్లడించాయి. ఎక్కువ సర్వేలు బీజేపీకి ఆధిక్యం ఉంటుందని అంచనా వేశాయి. చాణక్య స్ట్రాటజీస్ సర్వే ప్రకారం, 294 స్థానాలున్న బంగాల్ అసెంబ్లీలో బీజేపీ 150 నుంచి 160 స్థానాలు గెలుచుకుని మెజారిటీ సాధించే అవకాశముందని తెలిపింది. టీఎంసీకి 30 నుంచి 40 స్థానాలు, అలాగే, ఇతరులకు ఆరు నుంచి 10 సీట్లు మాత్రమే గెలుచుకుంటారని అంచనా వేసింది. అలాగే, బంగాల్‌లో బీజేపీకి 146-161 సీట్లు, టీఎంసీకి 125-140 స్థానాలు, ఇతరులకు 6 నుంచి 10 సీట్లు వచ్చే అవకాశముందని మాట్రిజ్? అంచనా వేసింది. జేవీసీ సర్వే ప్రకారం, బీజేపీ 138-159 స్థానాలు, టీఎంసీ 131-152 స్థానాలు, కాంగ్రెస్?కు రెండు ఓట్లు, వామపక్షాలకు ఒక్క సీటు వచ్చే అవకాశం ఉందని తెలిపింది.

**'సోమవారం కౌంటింగ్ ప్రక్రియ షురూ'**

కాగా, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్?కు ఇంకా ఒక్కరోజే సమయం మిగిలి ఉంది. సోమవారం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో బంగాల్ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బంగాల్?లో రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. అయితే రెండు దశల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్? నమోదు అయినట్లు ఈసీ పేర్కొంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బంగాల్‌లో ఇదే అత్యధిక పోలింగ్ శాతమని తెలిపింది. మొదటి దశలో 93.19 పోలింగ్? నమోదు కాగా, రెండో దశలో 91.66 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించింది.

# 'ఓట్ల లెక్కింపు విషయంలో ఈసీ నిర్ణయమే ఫైనల్'

బంగాల్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులనే నియమించారని టీఎంసీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎన్నికల సంఘం నిర్ణయం నిబంధనలకు విరుద్ధంగా లేదని అభిప్రాయపడింది. కేవలం కేంద్రప్రభుత్వ పూల్ నుంచే సిబ్బందిని ఎంచుకునే అధికారం ఈసీకి ఉందని సుప్రీం తెలిపింది. ఓట్ల లెక్కింపు సమయంలో టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారు కాబట్టి ఆందోళన అవసరం లేదని పేర్కొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని నియమించాలన్న ఈసీ నిర్ణయాన్ని టీఎంసీ అంతకుముందు కలకత్తా హైకోర్టులో సవాల్ చేసింది. వారిని సూపర్‌వైజర్లుగా, అసిస్టెంట్లుగా నియమిస్తే బీజేపీకి అనుకూలంగా పనిచేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. అయితే ఈసీ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించడంతో టీఎంసీ సుప్రీంను ఆశ్రయించింది. ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్లుగా కేంద్ర అధికారులు ఉన్నా, మళ్లీ అదనంగా కేంద్ర సిబ్బందే ఎందుకని ప్రశ్నించింది. ఈసీ సర్క్యులర్ ప్రకారం రాష్ట్ర అధికారులను చేర్చుకోవాల్సి ఉన్నా, వారిని నియమించడం లేదని ఆరోపించింది. ఈ సమయంలో ఎన్నికల కమిషన్ న్యాయవాదులు స్పందించారు. ఓట్ల లెక్కింపుపై పూర్తి పర్యవేక్షణ అధికారం రిటర్నింగ్ అధికారికే ఉంటుందని, ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి అని గుర్తుచేశారు. కాబట్టి టీఎంసీకి అనుమానం అవసరం లేదని ఈసీ కోర్టుకు తెలిపింది. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం, ఈసీతో ఏకీభవించింది.

**'ఓట్ల లెక్కింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు'**

ఈ సందర్భంగా, ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది డీ.ఎస్. నాయుడు, రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి అని, ప్రభుత్వ ఉద్యోగులను ఏ విభాగం నుంచైనా సిబ్బందిని నియమించే అధికారం ఆయనకు ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని చెప్పారు. ప్రతి అభ్యర్థికి వారి స్వంత కౌంటింగ్ ఏజెంట్ కూడా ఉంటారని తెలిపారు.



అలాగే, టీఎంసీ ఆందోళనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి బదులుగా కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల నుంచి లెక్కింపు పర్యవేక్షకులను, సహాయకులను నియమించాలన్న ఈసీ నిర్ణయంలో ఎలాంటి చట్టవిరుద్ధత లేదని పేర్కొంటూ టీఎంసీ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఆ పిటిషన్‌ను ఏప్రిల్ 30న కోల్?కతా హైకోర్టు కొట్టివేసింది. దీంతో మమత సుప్రీం ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది.

**మమతకు న్యాయపరమైన దెబ్బ!**

మరోవైపు, మమతా దాఖలు చేసిన పిటిషన్?ను కోర్టు తోసిపుచ్చడంపై బీజేపీ స్పందించింది. కోర్టు నిర్ణయం మమతా బెనర్జీకి న్యాయపరమైన ఎదురుదెబ్బ అని బీజేపీ సీనియర్? నాయకుడు అమిత్? మాల్వీయా పేర్కొన్నారు. అయితే, మాల్వీయా వ్యాఖ్యలపై టీఎంసీ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

**మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ- వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు**

కాగా, 294 అసెంబ్లీ స్థానాలకు గానూ బంగాల్ అసెంబ్లీకి ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. అయితే, మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఈ క్రమంలో మరో కీలక పరిణామం జరిగింది. అయితే, బంగాల్?లోని రెండు నియోజక వర్గాల్లో ఎన్నికల అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మళ్లీ ఎన్నికలు (రీపోలింగ్?) నిర్వహించారు ఈసీ అధికారులు. మగ్రాహాట్? పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో, డైమండ్ హార్బర్?లోని 4 బూత్?ల్లో రీపోలింగ్ నిర్వహించారు. ఈ రీపోలింగ్? ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని ఈసీ తెలిపింది.

# రికార్డు స్థాయిలో దాడులు పెరిగాయ్- అరెస్టులు తగ్గాయ్

కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రైడ్స్‌తో ముడిపడిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. 2025 - 2026 ఆర్థిక సంవత్సరంలో మనీలాండరింగ్ కేసులతో ముడిపడిన ఈడీ సోదాల సంఖ్య డబుల్ అయ్యి 2,892కు పెరగగా, అరెస్టులు మాత్రం 27 శాతం తగ్గి 156కు చేరాయి. ఇక దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని రీతిలో అత్యంత భారీగా రూ.81వేల కోట్లకుపైగా విలువ చేసే ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈడీ 2025 - 2026 వార్షిక నివేదికలో ఈ వివరాలను ప్రస్తావించారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్యకాలంలో తాము దర్యాప్తు చేసిన మనీలాండరింగ్ కేసులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు.

ఈడీ వార్షిక నివేదికలోని కీలక అంశాలివీ

2025-2026 ఆర్థిక సంవత్సరంలో మనీ లాండరింగ్ కేసుల్లో ఈడీ అధికారులు అత్యధికంగా 2,892 రైడ్స్ చేశారు. అంతకుముందు సంవత్సరంలో చేసిన రైడ్స్ సంఖ్య 1,491 మాత్రమే. 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో మనీ లాండరింగ్ కేసుల్లో 214 మందిని ఈడీ అరెస్టు చేయగా, 2025-2026లో 156 మందిని అరెస్టు చేసింది. ఈ లెక్కన అరెస్టులు 27 శాతం తగ్గాయి. అంతక్రితం 2023 - 2024లో అత్యధికంగా 272 మంది ఈడీ అరెస్టు చేసింది.

పక్కా ఆధారాలు లభించిన మనీ లాండరింగ్ కేసుల్లోనే అరెస్టులు చేస్తున్నామని, అందుకే అరెస్టులు తగ్గాయని వార్షిక నివేదికలో ఈడీ ప్రస్తావించింది. 2025-2026లో తమ ఉన్నతాధికారుల నుంచి అందిన 712 ఆదేశాల అమలులో భాగంగానే రూ.81,422 కోట్లు విలువైన ఆస్తులను తాత్కాలికంగా అటాచ్‌మెంట్ చేశామని ఈడీ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తుల అటాచ్‌మెంట్‌లు 171 శాతం పెరిగాయని పేర్కొంది. 2024 - 2025లో ఉన్నతాధికారులు జారీచేసిన 461 ఆదేశాల అమలులో భాగంగా రూ.30,036 కోట్లు విలువైన ఆస్తులను అటాచ్ చేశామని ఈడీ తెలిపింది. 2025-2026లో రూ.32,678 కోట్లు విలువైన ఆస్తులను ఆయా కేసుల్లో మోసపోయిన వారు, బాధితుల కోసం ఈడీ పునరుద్ధరించింది. రిలీజైన ఈ ఆస్తుల్లో రూ.15,582 కోట్లు విలువైనవి పెర్ల్స్ అగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్ (ౌాజా)తో ముడిపడిన పోంజీ కేసుకు సంబంధించినవే కావడం గమనార్హం. మనీలాండరింగ్ కేసుల బాధితుల్లో ఇళ్ల కొనుగోలుదారులు, బ్యాంకులు, ఇన్వెస్టర్లు ఉన్నారు. 2024-2025లో కేవలం రూ.15,263 కోట్ల ఆస్తులనే ఈడీ పునరుద్ధరించి బాధితులకు అందించింది. 2025-2026లో రూ.15వేల కోట్లు విలువైన ఆస్తుల పునరుద్ధరణ లక్ష్యాన్నే ఈడీ పెట్టుకోగా, అంతకంటే రెట్టింపు రేంజులో పునరుద్ధరించడం గమనార్హం.

**ఈడీ కేసుల లైఫ్ సైకిల్ తగ్గుముఖం**

రైడ్స్ నిర్వహించే క్రమంలో తాము కేవలం ప్రత్యక్ష సోదాలపైనే ఆధారపడటం లేదని ఈడీ స్పష్టం చేసింది. రైడ్స్‌ను ఎదుర్కొనే వారి నుంచి లభ్యమయ్యే ఆర్థిక సమాచారాన్ని మూడు మార్గాల్లో తనిఖీ చేస్తున్నట్లు చెప్పింది. ఇందుకోసం వివిధ డేటాబేస్‌ల నుంచి కీలక సమాచారాలను సేకరిస్తున్నామని తెలిపింది. బ్లాక్ చైన్ అనలిటిక్స్ ద్వారా క్రిప్టో కరెన్సీ లావాదేవీల వివరాలనూ కూడగడుతున్నామని వెల్లడించింది. కార్పొరేట్, ఆస్తి వ్యవహారాలతో ముడిపడిన రికార్డులనూ లైవ్‌లో తనిఖీ చేస్తున్నామని పేర్కొంది.

మనీ లాండరింగ్ కేసుల సమగ్ర సమాచారం ఉండబట్టే 2025-2026లో 812 ఛార్జ్‌షీట్‌లను కోర్టుల ఎదుట దాఖలు చేయగలిగామని ఈడీ చెప్పింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో 457 ఛార్జ్‌షీట్‌లనే దాఖలు చేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఎఫ్ఐఆర్ నమోదు తేదీ నుంచి తుది తీర్పు వెలువడే వరకు ఉండే వ్యవధిని నిర్దిష్ట కేసుకు చెందిన లైఫ్ సైకిల్ అంటారు. తమ కేసుల సగటు లైఫ్ సైకిల్ ఇంతకుముందు 3 నుంచి 4 ఏళ్లు ఉండేదని, దీన్ని 1 నుంచి ఒకటిన్నర ఏళ్లకు తగ్గించామని ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ కేసు దర్యాప్తును మొదలుపెట్టే ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్ - జుజ×=)ను ఈడీ నమోదు చేస్తుంది. ఈ విధంగా ఈసీఐఆర్ ప్రాతిపదికన నమోదైన మనీలాండరింగ్ కేసుల సంఖ్య 39 శాతం పెరిగి 1,080కి చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఈసీఐఆర్‌లతో నమోదైన కేసుల సంఖ్య 775 మాత్రమే.

**విదేశాలకు ఈడీ విన్నపాల లెక్క ఇదీ**

మనీ లాండరింగ్ కేసుతో సంబంధాలున్న ఎవరైనా వ్యక్తి విదేశంలో ఉంటే, ఆ దేశంలోని కోర్టు ద్వారా అతడిని విచారణ పరిధిలోకి తీసుకొచ్చేందుకు లెటర్స్ రొగేటరీ(ౌ=)ని ఈడీ వాడుకుంటుంది. ఇందులో భాగంగా కేసు దర్యాప్తులో న్యాయ సహాయాన్ని కోరుతూ భారత్‌లోని ఒక కోర్టు ద్వారా విదేశంలోని మరొక కోర్టుకు లెటర్స్ రొగేటరీ అనే విన్నపాన్ని పంపిస్తుంది. ఈ వ్యవహారం రెండు దేశాల కోర్టుల మధ్యే నడుస్తుంది. ఇక ఎంఎల్ఏటీ అంటే మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్ ట్రీటీ. నేర దర్యాప్తునకు సంబంధించిన కేసుల్లో సమాచారాన్ని, ఆధారాలను ఇచ్చి పుచ్చుకునేందుకు రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఎంఎల్ఏటీ అంటారు. దీని ద్వారా నేరగాళ్లను పట్టుకోవడంలో ఇరుదేశాలు నేరుగా సహాయ సహకారాలను అందించుకుంటాయి. 2025-2026లో మనీ లాండరింగ్ కేసుల్లో వివిధ దేశాలకు ఈడీ మొత్తం 353 లెటర్స్ రొగేటరీ, ఎంఎల్ఏటీ విన్నపాలను పంపింది. వీటిలో అత్యధికంగా 69 విన్నపాలు (19.6 శాతం) యూఏఈలోనే పెండింగ్ దశలో ఉన్నాయి. సింగపూర్‌లో 55, యూకేలో 39, హాంకాంగ్‌లో 36, అమెరికాలో 26, స్విట్జర్లాండ్‌లో 23, మారిషస్‌లో 15 విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయి. 2025-2026లో వివిధ దేశాల నుంచీ ఈడీకి ఇలాంటి 246 విన్నపాలు అందాయి. వీటిలో అత్యధికంగా 79 విన్నపాలు (32.9 శాతం) యూకే నుంచి, సింగపూర్ నుంచి 33, అమెరికా నుంచి 32, ఫ్రాన్స్ నుంచి 7 విన్నపాలు అందాయి.

## ఇకపై విపత్తు సమయాల్లో అలెర్ట్ మెసేజ్

భవిష్యత్‌లో ప్రకృతి విపత్తులు సంభవిస్తే ప్రభావిత ప్రాంతాల పౌరులను కేంద్ర ప్రభుత్వం క్షణాల వ్యవధిలోనే అప్రమత్తం చేయనుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా పూర్తి స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించింది. ఈ మేరకు శనివారం పరీక్షించింది. అందులో భాగంగా ప్రజల ఫోన్లకు డమ్మీ ఎమర్జెన్సీ మెసేజ్?ను పంపించింది. ఉదయం 11:46 నిమిషాలకు ఫోన్?లకు పెద్ద శబ్దం లేదా వైబ్రేషన్?తో అత్యవసర హెచ్చరిక నోటిఫికేషన్ వచ్చింది. డిస్‌ప్లేపై అలర్ట్ మెసేజ్ ప్రత్యక్షమైంది. అయితే ఇది పరీక్ష మాత్రమేనని, ఎవరూ భయపడొద్దని అధికారులు ఆ సందేశంలోనే వివరించారు. ఈ సందేశం ఇంగ్లీష్, హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లో కూడా వచ్చింది. అలర్ట్? మెసేజ్? వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదని భారతీయ టెలీ కమ్యూనికేషన్ శాఖ ఎక్స్?లో పోస్ట్? చేసింది. 'మీ ఫోన్స్?కు ఏదైనా అలర్ట్ మెసేజ్? వస్తే ఆందోళన చెందవద్దు. విపత్తుల సమయంలో కచ్చితమైన సమాచారం సకాలంలో తెలిపేలా చేయడం కోసం చేపట్టిన అత్యవసర హెచ్చరిక వ్యవస్థ. దానిని పరీక్షించడంలో భాగంగానే వచ్చింది' అని డోంట్ పానిక్ అని వీడియోను పోస్ట్? చేసింది. అయితే ఈ ఎమర్జెన్సీ అలర్ట్ గురించి ముందుగానే మెసేజ్?లు వచ్చాయి. మే 2న హెచ్చరికలు వస్తాయని, ఎవరూ భయాందోళలను చెందాల్సిన అవసరం లేదని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీనిని టెలీ కమ్యూనికేషన్ శాఖ (డీఓటీ), జాతీయవిపత్తు నిర్వహణ సంస్థ(ఎన్?డీఎంఏ) కలిసి ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఇది సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్) రూపొందించిన 'ౌాజుఎజు' ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించి ఉంది. సాధారణ ఎస్?ఎంఎస్?లతో పోలిస్తే సెల్? బ్రాడ్?కాస్ట్ హెచ్చరికలు ఒక ప్రాంతంలోని అన్ని మొబైల్‌లకు ఒకేసారి సందేశం చేరుతుంది. దీనివల్ల టెలికాం నెట్‌వర్క్‌లపై అధిక భారం పడకుండా వేగవంతమైన, విస్తృతమైన కవరేజ్ లభిస్తుంది. నెట్‌వర్క్ బిజీ అయినా కూడా పని చేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఈ టెక్నాలజీ ద్వారా వెంటనే హెచ్చరికలు అందించవచ్చు. భూకంపాలు, సునామీలు, మెరుపులు, గ్యాస్ లీకులు, రసాయన ప్రమాదాలు వంటి సమయాల్లో ప్రజలకు వేగంగా సమాచారం అందిస్తుంది.

**పలుమార్లు అలర్ట్ మెసేజ్**

వేర్వేరు మొబైల్ టవర్స్ ఈ వ్యవస్థను పరీక్షిస్తారు. అందువల్ల ఈ హెచ్చరికలు ఒకటి కంటే ఎక్కువసార్లు రావొచ్చని అధికారులు పేర్కొన్నారు. అలా వచ్చినప్పుడు ఎవరూ స్పందించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందేశాన్ని అందుకున్న ఎవరూ స్పందించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇది కేవలం దేశవ్యాప్తంగా అమలు చేయనున్న ఆధునిక విపత్తు హెచ్చరిక వ్యవస్థకు సంబంధించిన పరీక్ష మాత్రమే. టెస్టింగ్ పూర్తయ్యాక, ఈ వ్యవస్థ అధికారికంగా ప్రారంభమవుతుంది. అప్పుడు నిజమైన విపత్తుల సమయంలో కేవలం కొన్ని సెకన్లలోనే ప్రభావిత ప్రాంతంలోని ప్రజలకు హెచ్చరికలు చేరతాయి. అయితే గతంలో కూడా ఈ అలర్ట్ మెసేజ్?లు వచ్చాయి. 2023 సెప్టెంబర్? 21వ తేదీన పాన్ ఇండియా ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టమ్ పేరిట మెసేజ్?లు పంపించింది. అప్పుడు కూడా అలర్ట్ మెసేజ్?లని, వాటిని పట్టించుకోవద్దంటూ తెలిపింది. సెల్ బ్రాడ్‌కాస్ట్ టెస్ట్ అలర్ట్‌లు ఎనేబుల్ చేయబడిన మొబైల్ ఫోన్‌లలో మాత్రమే టెస్ట్ సందేశాలు అందుతాయి. వినియోగదారులు ఈ సెట్టింగ్‌లను ఈ విధంగా మార్చుకోవచ్చు: సెట్టింగ్స్, ఆ తర్వాత సేఫ్టీ అండ్ ఎమర్జెన్సీ, ఆ తర్వాత వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్స్, ఆ తర్వాత టెస్ట్ అలర్ట్స్ లోకి వెళ్లి ఈ అలర్ట్‌లను ఆన్? లేదా ఆఫ్? చేయొచ్చు.

## బంగాల్‌లో 77 మంది పోలీసు అబ్జర్వర్ల నియామకం



బంగాల్‌లో మే 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కీలక చర్యలు చేపట్టింది. బంగాల్ వ్యాప్తంగా ఉన్న కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేసేందుకు, శాంతి భద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు 165 మంది అదనపు కౌంటింగ్ అబ్జర్వర్లను, 77 మంది పోలీసు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ శనివారం తెలిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగాజరిగేలా చూడడమే లక్ష్యంగా ఈ అదనపు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్? 324, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 20బీ కింద తమకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ నియామకాలు చేపట్టినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అబ్జర్వర్లు డెప్యుటేషన్ పద్ధతిలో తమ నియంత్రణ, పర్యవేక్షణలో పనిచేస్తారని ఈసీ పేర్కొంది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న 165 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కౌంటింగ్ అబ్జర్వర్లకు సాయం చేసేందుకు ఈ అదనపు అధికారులను నియమించినట్లు పోల్ ప్యానల్ వివరించింది. "పోలీసు అబ్జర్వర్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసు అబ్జర్వర్లు ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ హాల్?లోకి ప్రవేశించరు. వీరు కౌంటింగ్ అబ్జర్వర్లతో, లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే ఇతర ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారు" అని ఈసీ స్పష్టం చేసింది.

**గుర్తింపు కార్డులు మస్ట్**

ఇక రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓ), కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్ల కోసం గుర్తింపు కార్డులను జుజ×చీవ్ లోని ప్రత్యేక మాడ్యూల్ ద్వారా ఆర్ఓ జారీ చేస్తారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో ఐడీ ఉంటేనే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారని, లేకుండా లోపలకు వెళ్లడం కుదరదని స్పష్టం చేసింది.

కౌంటింగ్ అబ్జర్వర్, రిటర్నింగ్ ఆఫీసర్ మినహా మరెవరూ కౌంటింగ్ హాల్ లోపలికి మొబైల్ ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదని ఈసీ తేల్చిచెప్పింది. "కంట్రోల్ యూనిట్లలో కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు లెక్కింపు ఫలితాలు ఉండే ఫారమ్ 17సీ-××ని సిద్ధం చేస్తారు. కౌంటింగ్ ఏజెంట్లకు వాటిని చూపిస్తారు. కౌంటింగ్ ఏజెంట్లు కోరుకుంటే ఈ ప్రక్రియను మళ్లీ పునరావృతం చేస్తారు. ప్రతి టేబుల్ వద్ద ఉండే మైక్రో-అబ్జర్వర్లు కూడా కంట్రోల్? యూనిట్ డిస్‌ప్లేలో కనిపించే ఫలితాలను వేరుగా నోట్ చేసుకుంటారు. వారు క్రాస్ వెరిఫికేషన్ కోసం ప్రతి రౌండ్ చివరలో ఆ వివరాలను కౌంటింగ్ అబ్జర్వర్లకు అందజేస్తారు" అని ఈసీ పేర్కొంది.

**టీఎంసీ బెదిరింపులు- ప్రజల నిరసనలు**

బంగాల్‌లో ఓట్ల లెక్కింపు తర్వాత తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ 24 పరగణా జిల్లా ఫాల్టాలో శనివారం వందలాది మంది గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఆ ప్రాంతంలో టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణహాని ఉందని వారు ఆరోపించారు. నిరసనకారులలో అధిక శాతం మహిళలు పాల్గొన్నారు. వారు బీజేపీ జెండాలను పట్టుకొని హసిమ్?నగర్? గ్రామంలో రహదారిని దిగ్బంధించారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత తమపై దాడులు చేస్తామని టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ సన్నిహితుడు, స్థానిక పంచాయతీ ప్రధాన్ ఇస్రాఫిల్? బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనితో సీఆర్?పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్? భారీ బలగాలతో ఆ ప్రాంతాన్ని సందర్శించి, ప్రజలకు తగు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ మహిళా మోర్చాకు చెందిన ఫాతిమా బీబీ మాట్లాడుతూ, "ఇస్రాఫిల్, అతని అనుచరులు ఏప్రిల్ 30 నుంచి మా ప్రాంతానికి వచ్చి, మే 5 నుంచి రక్తపాతం జరుగుతుందని మమ్మల్ని బెదిరిస్తున్నారు. అందుకే మా ప్రాంతంలో సీఆర్?పీఎఫ్? బలగాలు కొనసాగాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అని అన్నారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను జహంగీర్ ఖాన్ తోసిపుచ్చారు. కౌంటింగ్?కు ముందు టీఎంసీ మద్దతుదారుల మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి, తమ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయించే కుట్రలో భాగంగా బీజేపీ ఈ మహిళలను నిరసనకు పంపిందని ఆయన విమర్శించారు. ఒక వేళ తనపై వచ్చిన ఆరోపణలు నిరూపితమైనతే, చట్టపరమైన చర్యలకు బాధ్యత ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

# మా లక్ష్యం సర్వోదయ తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

సర్వోదయ తెలంగాణ సాధించటం కోసం మేము పాంచజన్యం అనే ఐదు అంశాలను తీసుకున్నామని అన్నారు. ఆధర్మంపై యుద్ధం చేసేందుకు శ్రీకృష్ణుడు మోగించిన యుద్ధబేరియే పాంచజన్యం. మేము కూడా అదే స్ఫూర్తితో పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్యత అంశాలను తీసుకున్నాం. ఇప్పుడు ప్రతిపక్షంగా...రేపు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇవే అంశాలను తీర్చటంలో మా ఫోకస్ ఉంటుంది. మన రాష్ట్రంలో చాలా కుటుంబాల్లో విద్య, వైద్యం కోసమే 60 శాతం ఆదాయం ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో సేవింగ్స్, ఎమర్జెన్సీ వస్తే ప్రజల దగ్గర డబ్బు ఉంటే పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తున్నప్పటికీ 75 శాతం ప్రజలు ప్రైవేట్ లోనే చదువుతున్నారు. ప్రైవేట్ లో చదివే వారికి కూడా వారు ఎంత వరకు చదువుతారో అంత వరకు కూడా ఉచిత విద్యను అందిస్తాం. అందరికీ ఉచిత విద్య సాధ్యమే. అందుకు అన్ని లెక్కలు వేసిన తర్వాతే మేము ప్రకటించాం. 20 ఏళ్లుగా మీరు నన్ను చూస్తున్నారు. ఇచ్చిన మాట, పట్టిన తోవను విడవకుండా ఉన్న వ్యక్తిని. ఇక వైద్యం విషయంలో కూడా ప్రజల డబ్బంతా దానికే ఖర్చు అవుతుందని అన్నారు.

ఆరోగ్యశ్రీలో ఇప్పుడు 10 లక్షల వరకు ఇస్తున్నారు. కానీ మొదట్లో 2 లక్షల రూపాయలే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కానీ ఇప్పుడు 10 లక్షలు ఇవ్వటం కూడా సాధ్యమవుతుంది. ఆరోగ్య శ్రీ దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఫ్రీ మీల్స్ ఉంటే కూడా సాధ్యమా అన్నారు. కానీ అది కూడా సాధ్యమైంది. మన రాష్ట్రంలో క్యాన్సర్ వస్తే డబ్బులు లేక వైద్యం అందక చాలా మంది చనిపోతున్నారు. మూడు లక్షల రూపాయలు కూడా లేక క్యాన్సర్ పేషెంట్లకు వైద్యం చేయించకుండా చాలా కుటుంబాలు సరిపెట్టుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల లైఫ్ స్పాన్ పెరుగుతుంటే మనం మాత్రం ఎందుకు ఇలా ఉండాలి? ఎన్ని లక్షలు ఖర్చైనా సరే తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం తెలంగాణ బిడ్డల వైద్యం కోసం వెనుకడుగు వేయదు. ఇక రైతు లేనిదే మనకు జీవితం లేదు. అలాంటి రైతుకు గౌరవం దక్కాలి. తెలంగాణలో రైతన్నకు ఆత్మగౌరవం కోసం తెలంగాణ రక్షణ సేన అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికీ కల్లాల దగ్గరే వడ్లు ఉన్నాయి. కొనుగోలు కేంద్రాలు తెరవమని రైతులు ధర్నా చేయాల్సిన పరిస్థితి. అసలు రైస్ ను ఎగుమతి చేసే పరిస్థితి ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. అందుకోసం ఒక కమిటీ ఏర్పాటు చేసి రైతుల పండించే బియ్యాన్ని ఎక్స్ పోర్ట్ చేయవచ్చు. జనంబాటలో మేము ఒక రైతును కలిశాం. నాలుగు రోజులుగా మక్కాలు కొనటం లేదంటూ కొనుగోలు కేంద్రం వద్దనే ఉన్నానని చెప్పారు. ఆ మరుసటి రోజే ఆ రైతు అదే మక్క కుప్పపై కుప్పకూలి చనిపోయాడు. అంటే మన దేశంలో రైతు ప్రాణానికి విలువ లేకుండా పోయింది. ఆ సంఘటన ఇప్పటికీ కూడా నన్ను కలవరపాటుకు గురిచేస్తోందని అన్నారు.

రైతన్నలకు మేలు చేసే విషయంలో మేము చాలా సీరియస్ గా పనిచేస్తున్నాం. ఇక మేము ఎంచుకున్న మరో అంశం ఉపాధి. మన రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్ అయిపోయింది. యూత్ ఏం కోరుకుంటున్నారో ప్రభుత్వానికి అర్థం కావటం లేదు. ఇతర దేశాల్లో ప్రభుత్వాలు అక్కడి యూత్ ఆలోచనలు ప్రోత్సహిస్తుండటంతో తక్కువ వయసులోనే వారంతా మిలియనీర్లు అవుతున్నారు. 18–25 ఏళ్ల లోపు ఉన్న జెన్ జీ ని నేను నమ్ముతున్నా. వారి ఆలోచనకు అండగా నిలవాలని మేము అనుకుంటున్నాం. జెన్ జీ తో పాటు 25–45 ఏళ్ల లోపు పాటు మంచి ఆలోచన తో వస్తే వారికి ప్రభుత్వమే 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణం ఇస్తుంది. యువత జాబ్ చేయటం కాదు. జాబ్ ఇచ్చేలా సిద్ధం కావాలి. మన దగ్గర నుంచి కూడా ఒక గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు రావాలి. మన రాష్ట్రంలో అన్ని సంస్థల నుంచి కూడా పదివేల కోట్ల ఆదాయం రావటం లేదు. ప్రభుత్వం దీనిపై సరైన దృష్టి పెడితే ఒకటి, రెండు కంపెనీలు సక్సెస్ అయిన సరే రాష్ట్రానికి చాలా ఆదాయం వస్తుంది. ఉద్యోగాలకు సంబంధించి మొన్న నేను 4 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ అంటే చాలా ప్రశ్నలు వచ్చాయి. కానీ ఎస్సీ, ఎస్టీ, ఫిజికల్లీ హ్యాండిక్యాప్ బ్యాక్ లాగ్ పోస్టులు చాలా ఖాళీ ఉన్నాయి. వాటన్నింటినీ నింపి ప్రభుత్వ శాఖలను బలోపేతం చేయాల్సి ఉంది. ఇక సీనియర్ సిటిజన్స్ కోసం కూడా మన దేశంలో ఒక శాఖ ఉండాలని అన్నారు.

సీనియర్ సిటిజన్స్ కు ఉన్న హక్కులకు సంబంధించి పోలీసులకు కూడా అవగాహన లేదు. వారి కంప్లైట్ ఇస్తే దాన్ని ప్రత్యేకంగా టేకాఫ్ చేయాల్సి ఉంటుంది. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్ లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదు. మంచి ఆరోగ్యం, ఆలోచన విధానం ఉన్న వాళ్లకు రుణాలు ఇవ్వకపోవటం దారుణం. మా ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అదే విధంగా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు కావాల్సిన అన్ని ప్రణాళికలు మా వద్ద ఉన్నాయని వెల్లడించారు.

**కేసీఆర్ ను వ్యక్తిగతంగా విమర్శించలేదు**

కేసీఆర్ లేకపోతే తాను లేనని తాను విమర్శించేది తన తండ్రి కేసీఆర్ ను కాదని..బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ను మాత్రమేనని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ వేదికగా కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తు కార్యాచరణను అత్యంత భావోద్వేగంతో, స్పష్టమైన వ్యూహంతో ప్రకటించారు. తండ్రి చాటు బిడ్డగా కాకుండా, ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగుతానని ధీమా వ్యక్తంమ చేశారు. తెలంగాణ సమాజంలో అన్ని అడ్డంకులను దాటుకొని తెలంగాణ రక్షణ సేన పేరుతో ఒక బలమైన రాజకీయ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశామని కవిత ప్రకటించారు.గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్న తెలంగాణ జాగృతి ఇకపై కూడా స్వచ్ఛంద సంస్థ గానే కొనసాగుతుందని, రాజకీయ పోరాటాల కోసం మాత్రం రక్షణ సేన రంగంలో ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ సాధనే లక్ష్యంగా తమ పార్టీ అన్ని వర్గాల సమస్యలపై గొంతుకగా మారుతుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో రైతు ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జాగృతి జనబాట లో తాను కలిసిన ఒక రైతు, మరుసటి రోజే పంట కొనుగోలు కేంద్రం వద్ద గుండెపోటుతో మరణించడం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఒక రైతు మరణం కేవలం చిన్న వార్తగా మిగిలిపోవడం విచారకరమని, తమ ప్రభుత్వం వస్తే రైతును నిజమైన రాజుగా మారుస్తామని ఆమె ప్రతిన పూనారు.సర్వోదయ తెలంగాణ సాధన కోసం పాంచజన్యం అనే ఐదు అంశాలతో కూడిన ప్రత్యేక కార్యక్రమాన్ని కవిత ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై తాము యుద్ధ భేరీ మోగిస్తామని, ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమాజంలోని అసమానతలను తొలగించి, సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ పాంచజన్యం ఉద్దేశమని ఆమె వెల్లడించారు.నేటి రాజకీయాల్లో, పరిపాలనలో మదర్లీ టచ్ ) లోపించిందని కవిత అభిప్రాయపడ్డారు. నేను మా అమ్మలాగా పరిణితి చెందాలని భావిస్తున్నాను. ప్రభుత్వాలకు అమ్మతనం లేదు కాబట్టే ప్రజల కష్టాలు వారికి పట్టడం లేదు అని ఆమె ఘాటుగా విమర్శించారు. పరిపాలనలో మానవీయ కోణం ఉండాలని, అప్పుడే ప్రజలకు అసలైన న్యాయం జరుగుతుదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం వచ్చాం అన్ని అడ్డంకులను దాటుకొని తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ ఫ్లాట్ ఫామ్ ను ఏర్పాటు చేసుకున్నాం.

20 ఏళ్ల పాటు సాగిన తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థగా అలాగే కొనసాగుతుంది.

# కుట్టుమిషన్ల పంపిణీలో అక్రమాలు

**మెదక్ :** ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి కుట్టుమిషన్ల పంపిణీపై అప్పుడే అనుమానాలు మొదలయ్యాయి. రూ.కోట్లు పక్కదారి పట్టించేందుకే ఇలాంటి పథకాలను తీసుకొస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి. గతంలో పలు పథకాలను అమలు చేసే సందర్భంలో టెండర్ల నుంచి మొదలుకుని లబ్ధిదారుల ఎంపిక వరకు తీవ్ర విమర్శలు వచ్చిన సందర్భాలను వారు ఎత్తిచూపుతున్నారు. తాజాగా ప్రతి ని యోకవర్గానికి వెయ్యి కుట్టుమిషన్లను అందిస్తామంటూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొ న్నం ప్రభాకర్ ప్రకటించిన నేపథ్యంలో అం దరిలోనూ మరోసారి చర్చను రేకెత్తించింది. ఈ పథకంలోనూ అవినీతి, అక్రమాలు జరుగుతాయని కొందరు చర్చించుకుంటున్నారు.గతంలో పలు కొత్త పథకాలు అమలు చేయడంలో వచ్చిన ఆరోపణలు, లబ్ధిదారుల ఎం పిక, టెండర్ల ఎంపికలో వెల్లువెత్తిన అక్రమాలు, అవినీతి ఆరోపణలు వచ్చిన నేప థ్యంలో కుట్టుమిషన్ల పంపిణీలో ఇలాంటి వాటికి ఆస్కారం ఉండకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ సందర్భంగానే రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ప్రజలు పలు సూచనలు చేస్తున్నారు. బీసీల్లోని నిరుపేదలకు కుట్టుమిషన్లన అందిం చాలనేది అందరూ స్వాగతిస్తున్న అంశమే.అయితే ఇలా కుట్టుమిషన్లను అందించే ప్రక్రియలో పారదర్శకత, మార్గదర్శకాల అమలు పైనే అందరూ చర్చిస్తూ అవినీతి, అక్రమాలకు ఇక్కడే శ్రీకారం చుడతారనే అనుమానా లను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకుగాను ఒక్కో నియోజవర్గానికి వెయ్యి కుట్టుమిషన్లను అందించి.. బీసీ నిరుపేద కుటుంబాలకు ఉపాధిని పెం పొందించేలా చూడటానికి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కుట్టుమిషన్ల పంపిణీని చేపట్టనున్నారు. అంటే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.20 లక్షల కుట్టుమిషన్లను పం పిణీ చేయనున్నారు.వాస్తవానికి టెండర్ల విషయంలో ఏదైనా అవినీతికి ఆస్కారం కలుగుతుంది. టెండరుదారుల అర్హతలను నిర్ణయించడమే ఈ అక్రమాలకు శ్రీకారం చుడుతుంది. గతంలోలాగా ఆంధ్రాకు చెం దిన బడా కాంట్రాక్టర్లకు ఈ టెండర్లు దక్కేలాగా అర్హతలు ఉండకుండా కనీసం ఐదారు గురికి అదీ తెలంగాణవారికి టెండర్లు వచ్చేలాగా అర్హతలను నిర్ణయిస్తే అవినీతికి ఆస్కా రం లేకుండా ఉంటుందని మేధావులు సై తం అంటున్నారు. అలాగే కుట్టుమిషన్లను సరఫరా చేసేవారిలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) వారికికూ డా అవకాశం దక్కేలా చూడాలని వారంటున్నారు. దీంతోపాటు మహిళా వ్యాపారవే త్తలకు, 25 శాతం ఎస్సీ వ్యాపారవేత్తలకు టెండర్లు దక్కేలా మార్గదర్శకాలు రూపొందిస్తే స్థానికులకు వ్యాపార అవకాశాలు ఇచ్చి నట్టవుతుందని వారంటున్నారు.ఇక ఒక్కో కుట్టుమిషన్‌కు ధర ఎంత అనే ది నిర్ణయించడంలోనే అసలైన ఆరోపణలు వస్తాయని వారు సూచిస్తున్నారు. బహిరంగా మార్కెట్‌లో ఒక్కో కుట్టుమిషన్ ధర కంటే 1.20 లక్షల కుట్టుమిషన్లకు తక్కువ ధరకే వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం టెండరుదారులతో సమావేశం ఏర్పాటుచేసి ఎవరు తక్కువ ధరకు ఇస్తే వారికి టెండర్లు ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి (బీసీ సంక్షేమం) నిధులు మిగులుతాయని వారంటున్నారు. అలా కాకుండా గతంలో అనేక పథకాల విషయంలో జరిగినట్టుగానే ధరలను రెట్టింపు చేసి ప్రజా ధనాన్ని లూటీ చేసేలా లోపాయికారీ ఒప్పందాలకు వెళ్లకుండా చూడాలని వారం టున్నారు.ఇలా జరిగితే ప్రభుత్వంపై మరోసారి అవినీతి, అక్రమాల ఆరోపణలు, విమ ర్శలు రావడం ఖాయమని, దీనివల్ల ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి తలెత్తి అంతి మంగా ప్రభుత్వానికే నష్టం వాటిల్లుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత అవసరమని ప్ర జలు అంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాల లబ్ధిదారుల ఎంపికలో వచ్చినట్టుగా అవినీతి ఆరోపణలు రాకుండా ఉండేలా బీసీల్లో ఉన్న కిందిస్థాయి వర్గాల నుంచి ఎంపిక జరగాలని వారంటున్నారు. రాజకీయ పక్షాల ప్ర భావం ఉండకుండా.. పారదర్శకంగా ఎంపిక ఉండాలని ప్రజలు కోరుతున్నారు.రైతు బంధులాగా నేరుగా బెనిఫిట్ ట్రా న్స్‌ఫర్ (డీబీటీ) విధానం అయితే మరీ మం చిదని మేధావులు సూచిస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి వారి బ్యాంకు ఖాతా ల్లోకి కుట్టుమిషన్‌కు నిర్ణయించిన ధర మొ త్తాన్ని బదిలీ చేస్తే ప్రభుత్వం గుర్తించిన టెండరుదారుల నుంచి వారే నేరు గా కుట్టుమిషన్లను కొనుగోలు చేసే అవకాశం ఉంటుం ది. పైగా లబ్ధిదారుల అవసరాలమేరకు సొంతంగా మరికొం త డబ్బు కలిపి కొత్త కొత్త సౌకర్యాలతో ఉన్న కుట్టుమిష న్లు కొనుగోలు చేసుకునే అవకాశాం కల్పిస్తే మరింత ఉపయుక్తంగా ఉం టుందని ప్రజలు అంటున్నారు.ఇదీ కాకుం డా రాష్ట్రం మొత్తం ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు అప్పజెప్పకుండా మొత్తం 33 జిల్లాలకు ఒకరిద్దరి చొప్పున కుట్టుమిషన్ల సరఫరాదారు లు ఉండేలా జాగ్రత్త వహిస్తే మరింత పారదర్శకంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకు లు అభిప్రాయపడుతున్నారు. జిల్లాల వారీ గా కాంట్రాక్టర్లను ఎంపికచేస్తే స్థానికంగా ఉండే ఎంఎస్ఎంఈలకు అవకాశంగా ఉం టుందని వారంటున్నారు. ఇక ప్రభుత్వం ఏం చేస్తుందో.. ఎలా చేస్తుందో.. చూడాలి..!అంతంత మాత్రంగానే ఉన్న బీసీ సంక్షే మ శాఖ బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల కుట్టుమిషన్ల పం పిణీ కోసం సుమారు రూ.100 కోట్ల వరకు ఖర్చు పెట్టాలనే ఆలోచనతో ప్ర భుత్వం ముందుకు వెళ్తున్నట్టు సమాచారం. ఒక్కో కుట్టుమిషన్‌కు సుమారు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు పెట్టే అవకాశం ఉంది. కాస్త అధునాతన సౌకర్యాలతో ఉండే కుట్టుమిష న్లను ఎంపిక చేసుకుంటే మరింత ఎక్కు వ ధర ఉండే అవకాశం ఉంది. మొత్తం గా సుమారు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసే ఈ కుట్టుమిషన్ల పంపిణీలో అవినీతికి, అక్రమాలకు తావీయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



## రేపు తెలంగాణ కేబినెట్ భేటీ

-మొదటిపేజీ తరువాయి

ఇటీవల భేటీలో తీసుకున్న కీలక నిర్ణయాలు ఇవే : ఇటీవల జరిగిన సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు నామినేట్ పద్ధతిన పాలక వర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గచ్చిబౌలి స్టేడియాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలని కేబినెట్? నిర్ణయించింది. అదే విధంగా ఉద్యోగులకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్? సహా పలు కీలక అంశాలపై ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

## 'జాబ్ క్యాలెండర్ ప్రకారం ఒక్క ఉద్యోగమైన భర్తీ చేశారా?'

-మొదటిపేజీ తరువాయి

ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులతో ఇంటరాక్ట్ అయ్యారు హరీష్‌రావు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. 'నిరుద్యోగులు నోటిఫికేషన్ వద్దంటున్నారని సీఎం రేవంత్ చెబుతున్నారు. కానీ నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. రాహుల్ గాంధీని అశోక్ నగర్ తీసుకువచ్చి మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలని నమ్మించారు. ఆనాడు నమ్మించి..నేడు వంచించడం కాంగ్రెస్ నైజం. సెంట్రల్ లైబ్రరీలో పోలీసులతో నిరుద్యోగులపై రేవంత్ దాడి చేయిస్తున్నారు. దీ=రా హయాంలో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. కాంగ్రెస్ వచ్చాక భర్తీ చేసింది కేవలం 16 వేల ఉద్యోగాలని సీఎం రేవంత్ అసెంబ్లీలో చెప్పారు. మిగిలిన 1.84 లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారో సీఎం సమాధానం చెప్పాలి. పోలీస్ శాఖలో 19 వేల ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని డీజీపీ చెప్పారు. మరి 5 వేల ఉద్యోగాలకే ప్రభుత్వం అనుమతి ఇచ్చి..మిగతా 14 వేల పోస్టులను ఎందుకు ఆపుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో 40 వేల పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేశాం. విద్యా కమిషన్ రిపోర్ట్‌ని సీఎం రేవంత్ ఎందుకు బయటపెట్టడం లేదు. రాష్ట్రంలో 30 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయి. మెగా డీఎస్సీసీ కాస్త దగా డీఎస్సీ అయిపోయింది. రేవంత్ నీ డ్రామాలు బంద్ చేయి. చిల్లర మాటలు కాదు కావాల్సింది...జాబ్ నోటిఫికేషన్ కావాలి. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ అయి చిత్తు కాగితం అయింది. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఒక్క ఉద్యోగమైన భర్తీ చేశారా?, నీ కోసం పని చేసిన నిరుద్యోగులే రేపు రేవంత్‌ని బొందపెడతారు. తక్షణమే జాబ్ నోటిఫికేషన్ విడుదల చేసి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి. లేదంటే నిరుద్యోగులతో సెక్రటేరియట్ ని ముట్టడిస్తాం' అని హెచ్చరించారు.

## కవిత పార్టీలోకి వలసలు




-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించడానికి ముందే బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు.. కవితకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా మరో మాజీ మంత్రి బోడ జనార్దన్.. కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే తన అనుచరులతో కలిసి అతి త్వరలోనే టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు బోడ జనార్దన్ స్పష్టం చేశారు.హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ నేత బోడ జనార్ధన్ కీలక చర్చలు జరిపారు. త్వరలోనే తన ఫ్యాన్స్, మద్దతుదారులతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని బోడ జనార్ధన్ పేర్కొన్నారు.మంచిర్యాల జిల్లా చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుంచి బోడ జనార్దన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా బోడ జనార్ధన్ పని చేశారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయడానికి.. టీఆర్ఎస్ పార్టీని విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని బోడ జనార్ధన్ తెలిపారు.సీనియర్ నేత అయిన బోడ జనార్ధన్ టీఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీకి కొత్త ఉత్సాహం రానుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన బోడ జనార్దన్.. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఉన్న చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున కీలక వ్యక్తిగా ఎదిగారు. రాజకీయాల్లో అనుభవం ఉన్న నేతగా టీఆర్ఎస్ పార్టీలో చేరుతుండటంపై ఆ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.

## 10 న ప్రధాని తెలంగాణ పర్యటన

-మొదటిపేజీ తరువాయి

పార్క్ వంటి కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అదేవిధంగా హఫీజ్పేట్, జోగులాంబ ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. భవిష్యత్తులో వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, ఎయిర్పోర్ట్ వంటి మరిన్ని ప్రాజెక్టులు కూడా రాబోయే దశలో అమలులోకి తీసుకువస్తారని అన్నారు.

ఇక రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దుర్భరంగా మారింది. నెల మొదటి తేదీకి జీతాలు అందకపోవడం, టీచర్లకు వేతనాలు ఆలస్యమవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. 2015 తర్వాత పీఆర్సీ బకాయిలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ప్రయోజనాలు కూడా ఆలస్యంగా అందుతున్నాయి. హైకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే, నాలుగు వారాల్లోగా ఇవ్వాల్సిందేనని కోర్టు మొట్టికాయలు వేస్తే గాని కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం రాలేదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తుంది. ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. ఉద్యోగులను కార్పొరేషన్ సిబ్బందిగా కాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలి. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడవకూడదు. ప్రకటనలు చేయడం కాకుండా, వెంటనే అమలు చేయడం అవసరం. కార్మిక సంఘాల పోరాటంతో ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గి ప్రకటన చేసినప్పటికీ, పూర్తి స్థాయిలో అమలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రజలు ఇప్పటికీ ఆ హామీల అమలుకై ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా రైతుల పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. నేను స్వయంగా పలు వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించాను. అక్కడ వరి ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి ఉండటం, వర్షాల వల్ల పంట నష్టపోవడం వంటి దృశ్యాలు కనిపించాయి. సరైన సమయంలో లారీలు, ట్రక్కులు అందుబాటులో లేకపోవడం వల్ల ధాన్యం లిఫ్టింగ్ ఆలస్యమవుతోంది.కొన్ని చోట్ల రైస్ మిల్లర్లు, మధ్యవర్తులు మరియు కొందరు అధికారులు కలిసి రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఓూఖ) కంటే తక్కువ ధరకు రైతులు తమ పంటను అమ్ముకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది పూర్తిగా అన్యాయం. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలి.వరి రైతులే కాకుండా, మొక్కజొన్న రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి పంటలను కూడా ప్రభుత్వం ఓూఖ ప్రకారం కొనుగోలు చేయాలి. రైతులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. కాబట్టి రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## సంపాదకీయం

# ఉపశమనమా లేక దీర్ఘకాల అభివృద్ధా?

దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయం గా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి.ఇవి ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది.యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి.ఇక్కడ విద్య, ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం. ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, హామీలు ఇవ్వడం చాలా సులభం. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది, ప్రజల నుంచే. ఒక సమాజం చైతన్యవంతంగా మారితే, రాజకీయాలు కూడా మారతాయి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా, తమ బాధ్యతలను కూడా గుర్తించాలి. ఉచితాల కోసం కాకుండా, అభివృద్ధి కోసం ఓటు వేయాలి. అప్పుడు మాత్రమే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, మేధావులు కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఉచితాలవల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలి. దీర్ఘకాల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనం కంటే సత్యాన్ని చూపాలి. మొత్తంగా చూస్తే, ఉచితాల రాజకీయాలు పూర్తిగా శాపమని చెప్పలేం. కానీ అవి నియంత్రణ లేకుండా కొనసాగితే, సమాజానికి నష్టం కలిగించే అవకాశం ఉంది. అవసరమైన చోట ఉచితాలు ఉండాలి, కానీ అవి ఒక వ్యూహంగా మారకూడదు. ప్రజల సంక్షేమం అనే పేరుతో ఓట్లు కొనే ప్రయత్నం ఆగాలి. ఈ రోజు మనం ఒక కీలక దశలో ఉన్నాం. ఒక దిశలో కొనసాగితే, మనం ఆధారపడి జీవించే సమాజంగా మారిపోతాం. మరో దిశలో ముందు కు సాగితే, మనం స్వయం సమర్థతతో అభివృద్ధి చెందే సమాజంగా మారగలం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న మళ్లీ అదే.. మార్పు ఎవరు తెస్తారు? జవాబు కూడా అదే, మనమే. ప్రజలు మేలుకుంటే, రాజకీయాలు మారతాయి. నాయకులు కూడా మారాల్సి వస్తుంది. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని నిలబెట్టుకోవాల్సి వస్తుంది. ఆ రోజు తప్పకుండా వస్తుంది. కానీ అది స్వయంగా రాదు. మన ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, మన ఓటులో మార్పు వచ్చినప్పుడే, మన సమాజంలో మార్పు వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరం, చైతన్యం, బాధ్యత, దీర్ఘకాల దృష్టి. ఉచితాల మాయ నుండి బయటపడి, అభివృద్ధి మార్గంలో నడవాల్సిన సమయం ఇదే.

# అక్షరాలా నిప్పుల కొలిమి



ప్రతియేటా ఇంచుమించు మే నెల మొదటి వారానికిగానీ ఉగ్రరూపం దాల్చని మార్తాండుడు ఈసారి ఫిబ్రవరి నెలాఖరునాటికే చెలరేగడం మొదలెట్టాడు. ముందే రావటం, దీర్ఘకాలం తిష్టవేయటం కొన్నాళ్లుగా కనబడుతున్నా ఈ స్థాయిలో ఎండలు మండిపోవటం ఇదే తొలిసారి. మన దేశంలో రుతువులు గతి తప్పి చాన్నాళ్లయింది. గతంలో పొద్దుటిపూట ఒక రకం, రాత్రికి మరో రకం వాతావరణం దర్శనమిచ్చేవి. ఎంత ఎండాకాలమైనా రాత్రికి ఎటునుంచో వచ్చి చల్లని గాలులు తాకేవి. సేదతీర్చేవి. ఇప్పుడు రాత్రింబగళ్లు తేడా లేదు. వేడిగాలుల వెనకే హఠాత్తుగా వాతావరణం మారి, జల్లులు మొదలై వడగళ్లు పడటం రివాజుగా మారింది. అటు తర్వాత కాసేపటికే ఉక్కబోత మొదలవుతోంది. ప్రకృతికి సంబంధించినంతవరకూ ఉత్తర దక్షిణాలన్న తేడా... మధ్య, పశ్చిమ భారత్‌లన్న వ్యత్యాసం లేదు. వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నదాన్నిబట్టి ప్రస్తుతం 23 రాష్ట్రాలకు వడగాడ్పుల తాకిడి ఉంది. అందులో డజనుకుపైగా తీవ్ర వడగాడ్పులను చవిచూస్తున్నాయి.

వందలాది నగరాలు భరించలేనంత ఉక్కబోతతో విలవిల్లాడుతున్నాయి. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలూ ఇప్పటికైతే ఈ సమస్యకు దూరంగా ఉంటున్నాయి. కానీ పర్యావరణంలో వస్తున్న మార్పుల పర్యవసానంగా భవిష్యత్తులో ఇవి సైతం భానుడి ప్రతాపాన్ని చవిచూడకతప్పదని వాతావరణ శాస్త్రవేత్తలు జోస్యం చెబుతున్నారు. సాధారణ ఉష్ణోగ్రతలకన్నా కనీసం 5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువుంటే, అది వరసగా రెండ్రోజులు కొనసాగితే వడగాడ్పులు వీస్తున్నట్టు లెక్కేస్తారు. అది 7 డిగ్రీల సెల్సియస్‌కి మించి పెరిగితే తీవ్ర వడగాడ్పులుగా పరిగణిస్తారు. ఒక ప్రాంతం మైదానమా, కొండలతో ఉందా అనే అంశాన్ని కూడా ఈ విషయంలో పరిగణనలోకి తీసుకుంటారు. బొంబాయి ఐఐటీ ఇటీవల చేసిన అధ్యయనంలో గంగా--సింధు మైదానం (ఉత్తర భారతం)లో వేడిగాలులకు స్థానిక నేలలు, ఇతర వాతావరణ పరిస్థితులు కారణమని తేల్చింది. వెలుపలినుంచి వచ్చే వేడిగాలులే ఇందుకు దోహదపడుతున్నాయన్న అభిప్రాయాన్ని తోసిపుచ్చింది. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రత పెరగడంతో వేడిగాలులు భూ ఉపరితలానికి దగ్గరగా ఉండిపోతున్నాయి. నగరాల్లోని కాంక్రీట్ కట్టడాలు, తారురోడ్లు పగలంతా తీవ్ర ఉష్ణోగ్రతను స్వీకరించి, రాత్రికి సైతం సెగలు కక్కుతూనేవుంటున్నాయి. అందుకే ఇంతచేటు తీవ్రత! వరదలు, తుపానులు, భూకంపాల్లాగే వడగాడ్పులు కూడా ప్రకృతి వైపరీత్యమే. కానీ ప్రభుత్వాలు ఒప్పుకోవు. వడగాడ్పులవల్ల ఏటా వందలాది మరణాలు సంభవిస్తున్నా, ఆ విధంగా లెక్కేయటానికి తగిన విధానం రూపొందలేదు. సాధారణంగా శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్ లేదా అంతకన్నా ఎక్కువకు చేరి, శరీరంలో చెమట పట్టడం ఆగిపోయి చర్మం పొడిబారి ఎర్రగా మారితే, స్పృహ కోల్పోవటం లేదా మతిస్థిమితం తప్పడం, మూర్ఛరావడం వంటివి కనబడితే వడగాడ్పు మరణమని చెబుతారు. వీటికితోడు బాధితుడున్న ప్రాంతంలో వడగాలుల హెచ్చరిక ఉందా, అతను మరణించటానికి ముందు ఎండలో పనిచేశాడా లేదా అనేవి కూడా చూస్తారు. ఆ తర్వాతే వడగాడ్పు మరణంగా నిర్ధారిస్తారు. గుండెజబ్బు వగైరాలున్నా, వృద్ధాప్యంలో ఉన్నా ఆ జాబితాలో లెక్కేయరు. ఈ విషయంలో ప్రభుత్వాల వైఖరి మారాలి. వేసవిలో మరణాల రేటు గత కొన్నేళ్లలో ఎలావుందో చూసే విధానాన్ని అంతర్జాతీయంగా అనుసరిస్తున్నప్పుడు మనం మాత్రం ఎందుకు ఆ కొలమానాన్ని తీసుకోవటం లేదు? పదహారో ఆర్థిక సంఘం నిరుడు ఇచ్చిన నివేదికలో వడగాడ్పుల్ని, పిడుగుపాటుల్ని కూడా ప్రకృతి విపత్తులుగా పరిగణించాలని కోరింది. చాలా రాష్ట్రాలు ఎన్నో ఏళ్లుగా ఈ విషయంలో డిమాండ్ చేస్తున్నాయి. అలా లెక్కేస్తే అందుకు సంబంధించిన నిధుల్ని సహాయ కార్యక్రమాల కోసం వ్యయం చేయటానికి, బాధితులకు తక్షణ సాయం అందించటానికి వీలవుతుంది. వడగాడ్పులున్న ప్రాంతాల్లో భవన నిర్మాణం, సాగుపనుల సమయాలను మార్చటానికి, విద్యాసంస్థలు, కార్యాలయాల పనివేళల్ని సవరించటానికి వీలవుతుంది. అందుకే ప్రభుత్వాలు తక్షణం కదలాలి. అవసరమైన కార్యాచరణ రూపొందించాలి. జనం ప్రాణాలు కాపాడాలి.

# ఎవరి లెక్క ఎంత?

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇది కేవలం ఒక రాజకీయమైన ఘట్టంగా చూడలేం. ఇది ఆర్థిక స్వరూపాన్ని విస్తారంగా పునర్నిర్మించిన కీలకమైన పరిణామంగా భావించవచ్చు. విభజన అనేది దశాబ్దాల ఖజానా అసమతుల్యతలను, ప్రాంతీయ నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసింది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ స్వరూప ముసుగులో వ్యవస్థీకృతమైన పరాధీనతను బయటపెట్టింది. ఎప్పుడైతే విభజన జరిగిందో అప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను బాధిత రాష్ట్రంగా పరిగణిస్తూ వరాల జల్లు కురిపించింది.. ఆర్థిక సహకారం కూడా అందించింది.తెలంగాణ వార్తలు తెలంగాణ రాష్ట్రాన్ని మాత్రం సొంత కాళ్లపై నిలబడాల్సిన అనివార్యమైన పరిస్థితిలో వదిలిపెట్టింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే గొప్ప బహుమతి అనుకున్నది. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత రెండు రాష్ట్రాల ఆర్థిక గమనాన్ని పరిశీలిస్తే, ఖజానా నిర్వహణలో హైదరాబాద్ పాత్ర, రెండు రాష్ట్రాలకు సహకారం అందించడంలో కేంద్రం పారదర్శకత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత ఆంధ్ర ప్రాంత ప్రజలకు హైదరాబాద్ నగరం వివాదాస్పద అంశంగా మారింది. హైదరాబాద్‌తో ఆంధ్రుల బంధం తెగిపోయిందని చెప్పవచ్చు. వాస్తవానికి ఆంధ్ర ప్రాంతానికి హైదరాబాద్ రాజ్యంతో పరిసర సంబంధం అనుబంధం 1780–1800 సంవత్సరాల మధ్య ముగిసింది. సర్కార్ (కోస్తాంధ్ర) ప్రాంతాన్ని, రాయలసీమ జిల్లాలు (సీడెడ్) ప్రాంతాన్ని నిజాం పాలకులు బ్రిటిష్ పాలకులకు అప్పగించారు. 1953 సంవత్సరానికి ముందు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు మద్రాస్ ప్రెసిడెన్సీ, మద్రాస్ రాష్ట్రంలో 150 ఏండ్లపాటు ఉన్నాయి. అయితే 1591లో హైదరాబాద్ సంస్థానం ఏర్పడినప్పటి నుంచి 1948 వరకు హైదరాబాద్ నగరమే రాజధాని. ఇది తెలంగాణ నగరానికి నడిమధ్యన ఉన్నది. ఆంధ్రా సరిహద్దు ప్రాంతానికి హైదరాబాద్ 250 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. స్వాతంత్ర్యం అనంతరం 1953లో తొలిసారి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి, కర్నూల్ రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కానీ ఇది కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పొరపాటు నిర్ణయం, చారిత్రక తప్పిదం అని అనతికాలంలో తేలింది. ఎందుకంటే ఆంధ్ర ప్రాంతం ఆర్థికంగా బలహీనమైనది. మద్రాస్ రాష్ట్రంపై ఆధారపడి ఉండేది. కానీ స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోయింది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఇదే సమయంలో ఆంధ్రా ప్రాంత కాంగ్రెస్ నేతలు తమకు ఉన్న సత్సంబంధాలను ఆసరాగా చేసుకొని హైదరాబాద్ రాష్ట్రంతో విలీనం కోసం కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలను ప్రభావితం చేశారు. కేంద్రం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ ఏర్పాటు చేయగా ఆంధ్రతో కలిసేందుకు తెలంగాణ ప్రజలు వ్యతిరేకించారు. ప్రజల అభీష్టాన్ని పరిగణలోకి తీసుకోకుండానే 1956లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేసింది. పెద్దఎత్తున అభివృద్ధి చెందిన హైదరాబాద్‌ను రాజధానిగా చేయడం ద్వారా తెలంగాణ ప్రాంత మిగులు బడ్జెట్‌తో ఆంధ్ర ప్రాంతానికి ఉన్న ఆర్థిక సమస్యలు తీరుతాయనేది విలీనం ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల విలీనం తెలంగాణ ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా జరిగింది. ఈ రెండు ప్రాంతాలు 58 ఏండ్లపాటు కలిసి ఉన్నాయి. మద్రాస్ రాష్ట్రంతో ఆంధ్ర ప్రాంతం కలిసి ఉన్న 160 ఏండ్లతో పోల్చితే 58 ఏండ్లు చాలా తక్కువ. తెలంగాణ, ఆంధ్రతో హైదరాబాద్‌కు ఉన్న సంబంధాన్ని, ఆ ప్రాంతాలపై ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి.. ఈ చారిత్రక నేపథ్యం తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### ఆదాయంలో వాటా, పంపిణీ తీరు

తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల విలీనం సమయంలో ఆంధ్రరాష్ట్రం రూ.4 కోట్ల లోటు బడ్జెట్‌తో నడుస్తున్నది. అదే సమయంలో తెలంగాణ రూ.కోటి మిగులు బడ్జెట్‌తో ఉన్నది. 1955–56 నాటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ లెక్కల ప్రకారం తెలంగాణ తలసరి ఆదాయం రూ.15.04, ఆంధ్ర తలసరి ఆదాయం రూ.10.53 ఉన్నది. నిష్పత్తిగా చూసుకుంటే 1.43:1.00 అవుతుంది. రెండు రాష్ట్రాలు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడి, 58 ఏండ్లపాటు కొనసాగినప్పుడు తెలంగాణ ఆదాయం ఉమ్మడి రాష్ట్ర ఖజానాకు ఆసరాగా నిలిచింది. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నిధుల లోటును పూడ్చటానికి ఉపయోగపడింది. తెలంగాణలోని 10 జిల్లాలు, కోస్తాంధ్రలోని 13 జిల్లాల నుంచి వచ్చే ఆదాయం రాష్ట్ర ఆదాయంలో దాదాపు 50 శాతం వాటా ఉండేది. కానీ బడ్జెట్ నుంచి ఖర్చులో మాత్రం అసమానత ఉండేది. మొత్తం రాష్ట్ర ఆదాయంలో తెలంగాణ ప్రాంతానికి 35 శాతం మాత్రమే ఖర్చు చేస్తూ మిగిలిన 65 శాతం మాత్రం ఆంధ్ర ప్రాంతానికి వెచ్చించేవారు. తెలంగాణ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలన్న పెద్ద మనుషుల ఒప్పందం ఉన్నప్పటికీ అది ఆచరణకు నోచుకోలేదు. ఎన్నో ఉద్యమాలు జరిగినప్పటికీ సమైక్య రాష్ట్రంలో పరిస్థితి మారలేదు. రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ తిరిగి స్వరాష్ట్రంగా ఏర్పడే వరకు ఇదే విధమైన నిధుల పంపిణీ కొనసాగింది. ఇక రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 2014–15 నాటి రెండు రాష్ట్రాల లెక్కలు చూస్తే ఆసక్తికరమైన విషయాలు అర్థమవుతాయి. ఆంధ్రప్రదేశ్ రూ.13,337 కోట్ల లోటుతో ఉండగా, తెలంగాణ రూ.369 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్నది. ఇది రెండు రాష్ట్రాల విలీనం నాటి పరిస్థితిని ప్రతిబింబిస్తున్నది. అంటే సమైక్య రాష్ట్రంలో 58 ఏండ్లపాటు లక్షల కోట్ల రూపాయల తెలంగాణ నిధులను, ఆంధ్ర ప్రాంత లోటును పూడ్చటానికి సమైక్యపాలకులు మళ్లించారన్నమాట. ఇక్కడ మరో విషయం గమనించవచ్చు. తెలంగాణలోని నిధులను తమ ఇష్టానుసారం వాడుకోవచ్చని, వాటిని తరలించుకుపోవడంపైనే దృష్టి పెట్టిన ఆంధ్ర పాలకులు, అక్కడి లోటును పూడ్చటానికి మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా విభజన అనంతరం పరిస్థితిని గమనిస్తే రాష్ట్ర మొత్తం ఆదాయంలో స్టేట్ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ వాటా తెలంగాణలో 75 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 52 శాతం మాత్రమే ఉన్నది.తెలంగాణ వార్తలు

### విభజన తర్వాత ఆర్థిక స్థితిగతులు

ఆంధ్రప్రదేశ్: 2014–15లో ఏపీకి రూ.13,377 కోట్ల ఆర్థిక లోటు ఉన్నది. ఈ మేరకు కేంద్రం లెక్కలు వేసి రూ.11,500 కోట్లను గ్రాంటుగా ఇచ్చింది. అంతేకాకుండా ఆర్థిక లోటును పూడ్చేందుకు 14వ, 15వ ఆర్థిక సంఘాల ద్వారా రూ.52,000 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులు 2026 వరకు కూడా ఏటా ఏపీకి వస్తున్నాయి. వీటితో పాటు క్రమం తప్పకుండా కేంద్రం నుంచి గ్రాంట్లు అందుతున్నాయి. బడ్జెట్ నిర్వహణలో దూరదృష్టి లేకపోవడం వల్ల 2023–24 నాటికి ఏపీ ఆర్థిక లోటు రూ.38,683కి పెరుగగా, 2014–15లో రూ.1.2 లక్షల కోట్లుగా ఉన్న అప్పు 2023–24 నాటికి రూ.3.1 కోట్లకు పెరిగింది. తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.369 కోట్ల మిగులు బడ్జెట్‌తో



ఉండగా 2022–23 నాటికి రూ.5,994 కోట్ల మిగులుకు పెరిగింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, విద్యుత్తు ప్రాజెక్టుల విస్తరణ కోసం చేసిన అప్పులతో 2023–24 బడ్జెట్ సమయానికి మిగులు రూ.779గా ఉన్నది. 2014లో విభజన సమయంలో వారసత్వంగా వచ్చిన అప్పులు సుమారు రూ.80 వేల కోట్లు కాగా, 2023–24 బడ్జెట్ సమయానికి అప్పులు రూ.2.3 కోట్లకు పెరిగాయి. అయితే, ఈ అప్పుల ద్వారా పెట్టిన మూలధన వ్యయం సంపద సృష్టి కోసం వెచ్చించారు. ఇలా చేయడం వల్ల తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమై రాబడి పెరిగింది. తెలంగాణ ప్రాజెక్టుల కోసం కేంద్రం రూ.24,000 కోట్లు నిధులు ఇవ్వాలని నీతి అయోగ్ కేంద్రానికి సిఫారసు చేసింది. కానీ ఈ సిఫారసు అమలుకు నోచుకోలేదు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఎలాంటి అదనపు నిధులు అందలేదు. కేవలం చట్టబద్ధంగా లభించే పన్నుల వాటాలు, గ్రాంట్స్ మాత్రం అందాయి. ఈ నిధులు కూడా ఏపీతో పోల్చితే చాలా తక్కువ.

### హైదరాబాద్‌తో ఏపీకి ఏంటి సంబంధం?

విభజన తర్వాత హైదరాబాద్‌ను నష్టపోయామని ఏపీ రాజకీయ నేతలు పదేపదే అన్నారు.. అంటున్నారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం. హైదరాబాద్‌ను ఆంధ్ర నష్టపోయిందా? లేకపోతే సమైక్య రాష్ట్రంలో హైదరాబాద్‌పై ఆధారపడిందా? అనేది ప్రశ్న. హైదరాబాద్ ఎప్పుడూ తెలంగాణలో భాగమే. ఇక హైదరాబాద్‌తో ఆంధ్ర ప్రాంతం సంబంధం 1780–1800 మధ్యనే తెగిపోయింది. హైదరాబాద్ నిధులపై ఆధారపడటం అనేది మెజారిటీ ఆంధ్ర పాలకుల నిర్ణయమే కానీ, అది ఆంధ్ర ప్రాంత ప్రజల హక్కు కాదు. సమైక్య పాలనలో ఆంధ్ర ప్రాంత రాబడులను పెంచుకోవడంపై దృష్టి పెట్టని పాలకులు, తెలంగాణలో ఖర్చు పెట్టకుండా ఆ మిగులు నిధులపై ఆంధ్ర ప్రాంతానికి తరలించటం, వాటిపై ఆధారపడటం పరిపాటిగా మార్చుకున్నారు. ఇదే విషయం విభజన తర్వాత స్పష్టంగా తేలిపోయింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత హైదరాబాద్ నిధులు తెలంగాణకు మాత్రమే పరిమితం చేయడం అనేది, సుదీర్ఘ కాలం జరిగిన అన్యాయాన్ని సరిచేయడమే అవుతుంది. అంతేకానీ ఆంధ్ర ప్రజలు హైదరాబాద్‌ను కోల్పోయారని చెప్పడం, తమను తాము బాధితులుగా చిత్రీకరించుకోవడం, ఆంధ్ర ప్రాంత సంపన్నవర్గాల పెద్దల కేంద్రంగా జరిగే రాజకీయాలకు నిదర్శనం. కేంద్రం సహకారం: అసమానత, అన్యాయం విభజన తర్వాత కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు 20 జాతీయ సంస్థలు, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టును మంజూరు చేసింది. పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణకు 6 సంస్థలు ఇవ్వాలి, కానీ రెండు మాత్రమే పట్టాలెక్కాయి. ఏపీలోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, నిధులు ఇచ్చింది. ట్రిబ్యునల్ అనుమతి లేకుండానే కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రజిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చింది. కానీ తెలంగాణలోని 9 జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించినప్పటికీ, నిధులు మంజూరు చేయలేదు.

# ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం -- ఒక ఆత్మపరిశీలన

**గంగవరం రామకృష్ణారెడ్డి**
**( సీనియర్ జర్నలిస్ట్ )**

విశ్లేషణ ప్రతి సంవత్సరం మే 3న జరుపుకునే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను యునైటెడ్ నేషన్స్ 1993లో అధికారికంగా ప్రకటించింది. 1991లో ఆఫ్రికా ఖండంలోని విందోక్లో జరిగిన సమావేశంలో తీసుకున్న తీర్మానం ఆధారంగా ఈ దినోత్సవానికి రూపం దక్కింది. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఈ రోజు జరుపుకుంటారు.

అయితే,మే 03న వేడుకలు జరుపుకుంటున్నప్పటికీ, పత్రికల పట్ల ప్రజల్లో నమ్మకం తగ్గిపోవడం ఒక ఆందోళనకర పరిణామం. ఒకప్పుడు పత్రిక అంటే ప్రజల కళ్లు, చెవులూ. కానీ నేడు అదే పత్రికను చదవడానికి ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ఎందుకు? ముఖ్య కారణం వ్యవస్థల వైఫల్యం. అధికార యంత్రాంగం తమ అనుభవాన్ని ఆయుధంగా మార్చుకొని లోపాలను దాచిపెట్టి, సాధారణ ప్రజలను తప్పుదారి పట్టించే పరిస్థితి పెరిగింది. కళ్ల ముందు అన్యాయం జరిగినా, రాతపూర్వక ఫిర్యాదు లేకపోతే చర్యలు తీసుకోని నిర్లక్ష్యం ప్రజల్లో నిరాశను నింపుతోంది. ఇక ప్రజాప్రతినిధులు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకొని, అధికారులను కీలుబొమ్మలుగా మార్చడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇక పత్రికల విషయానికి వస్తే---ప్రధాన సమస్య వాణిజ్య ధోరణి పెరగడం. ప్రజా సమస్యల కంటే ప్రకటనలకే ప్రాధాన్యం ఇవ్వడం, పుట్టగొడుగుల్లా పత్రికలు పుట్టడం, వాస్తవాలున్న వార్తలు కూడా ప్రజలకు ఉపయోగపడని స్థితి రావడం--- అన్ని విలువలు బలహీనపడ్డాయి. కొంతమంది యాజమాన్యాలు ఆర్థిక లాభం కోసం ఎవరికైనా వేదిక ఇవ్వడం, నైతిక విలువలను పక్కన పెట్టడం జర్నలిజాన్ని దెబ్బతీస్తోంది. ఇది మాత్రమే కాదు---ప్రజల్లో కూడా విసుగు పెరిగింది. ఎన్నికలలో అక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకలు, నిరసన తెలిపిన వారిపై ఒత్తిళ్లు---ఈ అన్నీ కలిసి ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని తగ్గించాయి. ఫలితంగా ప్రజలు కేవలం ఓటు వేసే స్థాయికి మాత్రమే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాయితీగా పనిచేసే కొద్దిమంది జర్నలిస్టుల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. నిజం రాస్తే శత్రువులు పెరుగుతారు. ఆర్థికంగా కష్టాలు, సామాజికంగా ఒత్తిళ్లు---ఇవి వారి నిత్యజీవితంలో భాగమయ్యాయి. అయినా వారు వెనుకడుగు వేయకుండా పోరాడుతున్నారు. కానీ వారికి సరైన గుర్తింపు లేకపోవడం బాధాకరం. ఈ పరిస్థితిని మార్చాలంటే, మన సమాజానికి మళ్లీ విలువలతో కూడిన నాయకత్వం అవసరం. డా బి . ఆర్ . అంబేద్కర్ , మహాత్మా గాంధీ , సుభాష్ చంద్ర బోస్ , సురవరం ప్రతాప్ రెడ్డి , షూబుల్లాహ్ ఖాన్ వంటి మహనీయుల స్ఫూర్తి మళ్లీ రావాలి. నిజం కోసం, న్యాయం కోసం, ప్రజల కోసం పోరాడే ఆత్మవిశ్వాసం తిరిగి పెరగాలి.

ఈ సందర్భంగా నేను ఇచ్చే సందేశం పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం జర్నలిస్టుల హక్కు కాదు---అది ప్రజల హక్కు. పత్రికలు నిజం చెప్పాలి, ప్రజలు వాటిని చదవాలి, వ్యవస్థలు



వాటిని గౌరవించాలి. ఈ మూడు కలిసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఈ ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా--- "సత్యం రాయడం మా బాధ్యత, సత్యాన్ని నిలబెట్టడం సమాజ బాధ్యత" అనే నమ్మకంతో ముందుకు సాగుదాం.

# ప్రజా పాలన అంటే కాంగ్రెస్ పాలన

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి నియోజకవర్గంలోని సి.కే.ఆర్ గార్డెన్‌లో ఉదయం 10:00 గంటలకు ప్రారంభమైన ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశం విజయవంతం అయింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, పత్రికా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు విస్తృతంగా హాజరయ్యారు. సమావేశంలో రైతు భరోసా, మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్న వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి ( బ్యాంక్ లింకేజీ వడ్డీ లేని రుణాలు ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు, అలాగే జిల్లా మండల సాధారణ నిధులతో చేపట్టిన పనులపై సమగ్రంగా చర్చించబడింది. కార్యక్రమంలో జెడ్పి సీఈఓ కృష్ణారెడ్డి , కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి కల్వకుర్తి డిఎస్పి సైరెడ్డి వెంకటరెడ్డి, మున్సిపాలిటీ చైర్ పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,వైస్ చైర్మన్ షా నవాజ్ ఖాన్, జిల్లా ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు గుమ్మ కొండ రాములు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి, బట్టుకిషన్ రెడ్డి, బెక్కార బాల్ రెడ్డి, జగన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్,దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.






# కడ్తాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రైతులకు ప్రజాపాలన ప్రభుత్వం అండగా ఉంటుంది**
**ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి చైర్మన్ యాట గీత వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తాల్ రైతులకు ప్రజాపాలన ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పౌరసరఫరాల శాఖ సహకారంతో మండల ఐకెపి ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, ఏఎంసి చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ. ప్రజాపాలన ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని ప్రభుత్వ సన్న వడ్లకు అందిస్తున్న రూ. 500 బోనస్‌ను పొందాలన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కుమారి, ఏపీఎం రాములు, ఏఎంసీ డైరెక్టర్లు, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉప సర్పంచ్ ఈ రెడ్డి యాదగిరి రెడ్డి, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, వార్డు సభ్యులు భాను కిరణ్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్, నాయకులు చందోజి, జహంగీర్ బాబా, జాంగిర్ అలీ, వెంకట్ రెడ్డి, దారెడ్డి అంజన్ రెడ్డి, రాములు , బిక్షపతి, మహిళా సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామంలో మేకల దొంగలు గ్రామస్తుల్లో భయాందోళనలు

**అగ్నిధారన్యూస్ మహమ్మదాబాద్:**

మండలంలోని నంచర్ల గ్రామంలో వరుస మేకల దొంగతనాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నెంబర్ ప్లేట్ లేని తెల్లని కారులో గ్రామంలోకి చొరబడి ఒక మేకపోతు, రెండు మేకలను ఎత్తుకెళ్లారు. ఘటన సమయంలో మేకల కాపరి రెహమాన్ నిద్రలో ఉండగా, మేకలు అరవడంతో మేలుకుని కేకలు వేయడంతో గ్రామస్తులు చేరుకునేలోపే దుండగులు పరారయ్యారు.

గ్రామస్తులు రెండు బైకులపై వెంటాడినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు నంచర్ల గేట్ ఎక్స్ రోడ్డులో గస్తీ లో ఉన్న పోలీసులకు తెలియజేశారు. వెంటనే గతిలో ఉన్న పోలీసులు స్పందించి వెంబడించినా, దుండగులు మహమ్మదాబాద్ దాటి హన్వాడ వైపు పారిపోయినట్లు తెలిపారు. గత నెలలో కూడా ఇదే తరహాలో మేకల దొంగతనం జరిగిందని, అప్పుడే ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలతో గ్రామంలో రాత్రివేళ భయం నెలకొని, పశువుల కాపరులు నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే గస్తీ పెంచి దుండగులను పట్టుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.

## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఆదివరాహ దేవస్థానం చైర్మన్ ముస్త్యాల దామోదర్



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

పెద్దపల్లిజిల్లా కమాన్ పూర్ ఆదివరాహ దేవస్థానం నూతన చైర్మన్ గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన ముస్త్యాల దామోదర్ శనివారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు గారిని హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, స్వీట్ తినిపించి ఆత్మీయ సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు సైతం చైర్మన్ దామోదర్ కు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివరాహ దేవస్థానం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని.. దేవస్థానానికి మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా పాలకవర్గం పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్ ముస్త్యాల దామోదర్ కు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఇనగంటి చిన్నారావు, ఇనగంటి రామారావు, పిట్ల గోపాల్ తదితరులు ఉన్నారు.

## మాజీ మంత్రి కె టి ఆర్ నీ కలిసిన బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును హైదరాబాద్‌లోనీ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాం తో పాటు ఆహ్వాన పత్రిక అందజేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,దేవుని పడకల్ సర్పంచ్ అనిత మల్లేష్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతం చేయడానికి సమాజంలోని ప్రతి వర్గానికి ఉపయోగపడేలా రాజకీయ నాయకులు కలిసి పనిచేయాలని, ప్రజల అవసరాలను గుర్తించి ముందడుగు వేయాలని తెలిపారు. పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తది తరులు పాల్గొన్నారు.

## విగ్రహా ప్రతిష్ట ఉత్సవాల్లో పాల్గొన్న కౌన్సిలర్ పాపి శెట్టి రాము



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కంఠమహేశ్వర స్వామి, శివుడు , పోచమ్మ మైసమ్మ విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సందర్భంగా. విగ్రహాల ఊరేగింపుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత పాపిశెట్టి రాము ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. భక్తులు హోమాలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వంశీకృష్ణ శర్మ, రాఘవశర్మ, కృష్ణతేజ శర్మ, సూరజ్ శర్మ, భరత్ కుమార్ శర్మ, చంద్రకాంత్ శర్మ, నాయకులు శ్రీను నాయక్, సైదులు గౌడ్ ఉస్తవ కమిటీ సభ్యులు ఉన్నారు.

# మాదకద్రవ్యాలకు 'నో' చెప్పాలి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

సమాజం, ముఖ్యంగా యువత భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మంచిర్యాల జోన్ పరిధిలోని నస్పూర్ ఎస్.ఎన్. గార్డెన్‌లో శనివారం నిర్వహించిన గంజాయి వినియోగం, దాని దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు తీవ్రమైన ప్రమాదమని హెచ్చరించారు. వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. యువత తమతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా మాదకద్రవ్యాల ప్రభావం నుంచి కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. మాదకద్రవ్యాలపై సమాచారం అందిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అందిన సమాచారంపై కఠిన చర్యలు తీసుకుని డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా




ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు. మత్తుకు బానిసలైన వ్యక్తులను గుర్తించి వారి తల్లిదండ్రులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించి, అవసరమైతే పునరావాస కేంద్రాలకు పంపిస్తున్నట్లు వివరించారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా నియంత్రించగలమని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జిల్లా వెల్ఫేర్ అధికారి రహూఫ్, మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, నార్కోటిక్స్ విభాగం ఇన్స్పెక్టర్ రాజ్‌కుమార్, నస్పూర్ ఎస్ఐ ప్రశాంత్, హాజీపూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎంపై చర్యలు తీసుకోండి



**భరించలేకపోతున్నామని పి డికి వివో ఏల ఫిర్యాదు**

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :**

ఏపీఎం నిర్మల వేధింపులు భరించలేకపోతున్నామని వివోఏలు శనివారం కలెక్టరేట్లో జిల్లా డిఆర్డిఏ పిడి నరసింహులు కలిసి తమ గోడు వెళ్ళబోసుకొని ఏపి ఎం పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎం నిర్మల డబ్బులు కావాలని వత్తిడి చేయడంతో వివో ఎల అందరం 50వేల డబ్బులు కలెక్ట్ చేసి వివో ఎల మండల అధ్యక్షుడు వెంకటరాములుకు ఇవ్వడం జరిగింది అనంతరం వెంకట్ రాములు తన మొబైల్ ఫోన్ నుండి 50,000 ఫోన్ పే చేయించామని వెంటనే వాటిని తిరిగి వెంకట్ రాములు కు రిటన్ కొట్టి ఫోన్ పే ఎలా చేస్తావు క్యాష్ తీసుకొచ్చి ఇవ్వమని బెదిరించడంతో క్యాష్ తీసుకెళ్లి ఇవ్వడం జరిగింది అవి తీసుకుని మరిన్ని డబ్బులు కావాలని వేధింపులకు గురిచేస్తుందని ఇలా అయితే మేము డ్యూటీలు ఎలా చేయాలని మహిళా సమైక్యలో లోన్లు తీసుకుంటే అక్రమంగా తీసుకున్నారని లేనిపోని నిందలు మోపి లక్షలు లక్షలు రూపాయలు డిమాండ్ చేస్తుందని పోలీస్ కేసులు పెట్టించి మీ ఉద్యోగాలు లేకుండా చేస్తానని నేను చెప్పినట్లు వినాలి డబ్బులు ఇవ్వాలని వేధింపులు గురిచేస్తుందని పి డికి తమ గోడు వెల్లబోసుకుని కంటతడి పెట్టుకున్నారు. ఏపీఎం నిర్మల అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వీడికి విజ్ఞప్తి చేశారు.

## టెక్ మహీంద్రా చేతికి కెనడా ఐటీ కంపెనీ




**న్యూఢిల్లీ:** ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా కెనడా కంపెనీ అల్లూరి టెక్నాలజీస్ ఇంక్(అవాంట్)ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనిలో భాగంగా తొలుత 85% వాటాను సొంతం చేసుకోనుంది. ఇందుకు 2.8 కోట్ల కెనడియన్ డాలర్ల(రూ. 171 కోట్లు) వెచ్చించనుంది. మూడేళ్ల తదుపరి మిగిలిన 15% వాటాను ముందుగా నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు టెక్ మహీంద్రా పేర్కొంది. అవాంట్‌తో.. సొంత అనుబంధ కంపెనీ టెక్ మహీంద్రా కన్సల్టింగ్ గ్రూప్(టీఎంసీజీ) వాటా కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. తాజా కొనుగోలుతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సరవసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) విభాగంలో మరింత బలపడే వీలున్నట్లు తెలియజేసింది. 2029 జూన్ 30కల్లా మిగిలిన 15% వాటా సైతం దక్కించుకోనున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు ద్వారా ఉత్తర అమెరికా మార్కెట్‌లో టెక్ మహీంద్రా తన ఉనికిని మరింత సుస్థిరం చేసుకోనుంది. ముఖ్యంగా అల్లూరి టెక్నాలజీస్‌కు ఉన్న డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ నైపుణ్యం, టెక్ మహీంద్రా గ్లోబల్ నెట్‌వర్క్‌కు తోడవ్వడం వల్ల క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో కొత్త ప్రాజెక్టులను చేజిక్కించుకునే అవకాశం ఉంటుంది.

## పోస్టాఫీసు బ్యాంక్‌లో కొత్త అకౌంట్.. జీరో బ్యాలెన్స్‌తో..

కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ కొత్త అకౌంట్‌ను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా శక్తికి ఆర్థికంగా మరింత ఊతమిచ్చేందుకు 'స్వయం సహాయక బృందాల పొదుపు ఖాతా'ను ప్రత్యేకంగా ప్రారంభించింది. ఎటువంటి ఛార్జీలు లేని ఈ ఖాతా ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కానున్నాయి.

ఈ ఖాతా ప్రత్యేకతలు ఇవే..

మహిళా సంఘాల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఖాతాలో అనేక ఆకర్షణీయమైన ఫీచర్లు ఉన్నాయి.

## మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం



**ఎస్ఐ ఉషారాణి**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

మహిళా ఉద్యోగులు, పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర 99 రోజుల కార్యాచరణ 'ప్రజా పాలనా-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల భద్రతపై జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో శనివారం మంచిర్యాలలోని డి మార్ట్ షాపింగ్ మాల్‌లో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల్ ఉద్యోగులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది మహిళలకు అమలు చేస్తున్న భద్రతా చర్యలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, ట్రాఫిక్ నిబంధనలు, టీ-సేఫ్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నంబర్ 8712659385లను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం టీ-సేఫ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించే విధానాన్ని వివరించారు. అలాగే సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు వనిత, శ్రీలత, అసిస్టెంట్ స్టోర్ మేనేజర్ శ్రావణ్, డి మార్ట్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## రామగుండంలో 'దోస్త్' షార్ట్ ఫిలిం షూటింగ్



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

యువతలో విలువలను పెంపొందించే లక్ష్యంతో రూపొందుతున్న 'దోస్త్' షార్ట్ ఫిలిం చిత్రీకరణ రామగుండం నగరంలో వేగంగా కొనసాగుతోంది. పల్లవి చరణం మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి సంబంధించిన రెండో షెడ్యూల్ షూటింగ్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. దర్శకుడు మోదుంపల్లి రామస్వామి ఆధ్వర్యంలో ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. సహజత్వాన్ని ప్రతిబింబించేలా ప్రతి సన్నివేశాన్ని బృందం నిష్ఠగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా దర్శకుడు రామస్వామి మాట్లాడుతూ, నిజమైన స్నేహం అంటే ఏమిటి, నిజమైన స్నేహితుడు ఎవరు అనే అంశాలపై ఈ చిత్రం కేంద్రీకృతమైందన్నారు. భావోద్వేగాలకు దగ్గరగా, యువతను ఆలోచింపజేసే కథాంశంతో 'దోస్త్' రూపొందుతోందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న సంబంధాల మధ్య స్నేహానికి ఉన్న విలువను గుర్తు చేయడమే చిత్ర లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలోనే చిత్రీకరణను పూర్తి చేసి, ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఇప్పటికే ఈ చిత్రంపై ఆసక్తి నెలకొనగా, యువతకు సందేశాత్మకంగా నిలిచే చిత్రంగా 'దోస్త్' నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ చిత్రంలో లక్ష్మి, భూమయ్య, బాయ్ శ్రీనివాస్, గొల్లపల్లి రామలింగం, కంది నాగరాజు, వెంకటేష్, దుప్పటి సారయ్య, బోసాల అంజయ్య, రాజేశ్వరి, శ్రీలత నేత, సుమలత, సర్వర్ విన్ను, డుగ్గు, రిషి, రాకేష్, రాయి, వేణుగోపాల్ నటిస్తున్నారు. కెమెరామెన్ గొల్లపల్లి పవన్ తన చిత్రకళతో సన్నివేశాలకు జీవం పోస్తున్నారు. చిత్రబృందం సమన్వయంతో పనిచేస్తూ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తోంది.

## ఉప్పల చారి ట్రబుల్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత



**టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

అమంగల్ మున్సిపల్ 13 వార్డ్ లో తల్లోజు ఈశ్వరమ్మ భర్త రఘునయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారి కావడంతో వారిని నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మ న్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ద్వారా సిమెంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ పుల్లారెడ్డి అనుష శ్రీశైలం 12 వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ మాజీ మండల కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్ డిప్యూటీ సర్పంచ్ కోటీశ్వర్ మాజీ వార్డ్ సభ్యులు దశరథ సీనియర్ నాయకులు రవి, వెంకటయ్య, తది తరులు పాల్గొన్నారు

## మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా



**ఆర్థిక సహాయం అందజేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన కంఠం నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు.

విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా 5000అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పోలె రాజు, కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ వార్డు సభ్యులు కావలి వెంకటేష్, అభివర్మ, కంఠం రాములు, మాజీ వార్డు సభ్యులు రఫిక్, నాయకులు దారా రాజు, పరంజ్యోతి, ప్రవీణ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## యైటింక్లైన్ కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యం



**మేయర్ మహంకాళి స్వామి**

**అగ్నిధార న్యూస్, (రామగుండం):**

ఎంఎల్‌ఏ సూచనల మేరకు యైటింక్లైన్ కాలనీలోని అన్ని డివిజన్లను సమగ్రంగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. వార్డు సందర్శనలో భాగంగా శనివారం 15వ డివిజన్‌ను ఆయన పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ బుర్ర శశికళ ముత్యాలతో కలిసి కెకె నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులను, చెట్ల గుబుర్లను తొలగించే కార్యక్రమాలను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అలాగే పేరుకుపోయిన చెత్తను తొలగించి వీధులను పరిశుభ్రం చేయించారు. పనుల పరిశీలన అనంతరం మేయర్ మాట్లాడుతూ, పార్టీలకతీతంగా అన్ని డివిజన్లను సమాన దృష్టితో అభివృద్ధి చేస్తూ, ఎంఎల్‌ఏ నాయకత్వంలో రామగుండాన్ని తెలంగాణలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. చాలా కాలంగా పట్టించుకోకపోవడంతో 15వ డివిజన్ వెనుకబడి ఉందని తెలిపారు. స్థానిక సమస్యలను మునిసిపల్ అధికారులు నమోదు చేసుకున్నారని, వాటిని ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించి రోడ్లు, కాలువలు, మంచినీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, శంకర్ నాయక్, చక్రపాణి, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, అనుమ రాములు, శ్రీనివాస్, రాజేష్, నగర పాలక సంస్థ ఈఈ గురువీర, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోచ్‌లు, సెలక్టర్లు కావలెను! ఉండాల్సిన అర్హతలు ఇవే

గత కొన్నేళ్లుగా దేశవాళీ టోర్నీల్లో సత్తా చాటలేక చతికిలపడుతోంది తమిళనాడు క్రికెట్ జట్టు. ఈ నేపథ్యంలో తమిళనాడు క్రికెట్ సంఘం శిక్షణ బృందాన్ని బలోపేతం చేసే పనిలో పడింది. వరుస వైఫల్యాలు కాగా గత రంజీ సీజన్‌లో గ్రూప్ దశలో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న తమిళనాడు జట్టు... సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో సూపర్ లీగ్ దశకు చేరలేకపోయింది. దీంతో కోచింగ్ స్టాఫ్‌ను మార్పు చేయాలని భావించిన తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) కొత్త కోచ్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

# చెరువు మట్టి రవాణాపై నియంత్రణ

**మూడు చెరువులకు మాత్రమే అనుమతులు**
**ఫోటోగ్రఫీ, రసీదు తప్పనిసరి.**
**అధిక లోడుతో రవాణా నిషేధం --**
**అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు**
**ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, మే 02:**



పెద్దపల్లి జిల్లాలో ఇటుక బట్టీలకు చెరువుల నల్లమట్టి రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మట్టి ఇసుక రవాణాపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నీటి మట్టం తక్కువగా ఉన్న చెరువుల నుండి మట్టి తవ్వకాలకు గత సంవత్సరం సెస్ వసూలు చేసి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విధానాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ప్రస్తుతం కొదురుపాక చెరువు, రాయకుంట చెరువు, ముత్తారం చెరువుల నుండి మట్టి రవాణా కోసం 15 ఇటుక బట్టీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలో ఈ మూడు చెరువులకు మాత్రమే అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు. నీరు లేని చెరువులను మాత్రమే మట్టి తవ్వకాలకు పరిగణనలోకి తీసుకుని, సాగునీటి శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్‌ఓసీలు మంజూరు చేయాలని ఆదేశించారు.

మట్టి రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి వాహన రవాణాను ఫోటోగ్రఫీ చేయాలని, ప్రతి వాహనానికి రసీదు జారీ చేయాలని తెలిపారు. వాహనాలు అధిక లోడుతో రవాణా చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

మానేరువాగు పరిధిలో పెద్దపల్లి వైపు ఎలాంటి ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని, కరీంనగర్ వైపు జరుగుతున్న తవ్వకాల నేపథ్యంలో అక్కడి జేసీబీలు పెద్దపల్లి వైపు రాకుండా కఠినంగా హెచ్చరించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జేసీబీలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.ఈ అంశంపై జేసీబీ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో గనుల శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓలు బి. గంగయ్య,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ అభివృద్ధిలో పెద్దపల్లి ముందంజ





**ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు.**
**మే 6న మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి.**
**రాష్ట్రంలో అగ్రస్థానంలో పెద్దపల్లి ఆసుపత్రి.**
**రైతులు పంట మార్పుపై దృష్టి పెట్టాలి.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

పెద్దపల్లి మండలంలోని బందంపల్లి స్వరూప గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి రామ్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో పూర్తి స్థాయిలో అమలవుతున్నాయని తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచి 4 అవార్డులు సాధించిందని, ఓపీ సంఖ్య 280 నుండి 900కు, ప్రసవాలు 40 నుండి 250కు పెరిగినట్లు పేర్కొన్నారు. కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఎంఆర్ స్కాన్, సీటీ స్కాన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చయ్యే చికిత్సను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పెద్దపల్లి ఆసుపత్రికి వస్తున్నారని చెప్పారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రం, డయాలసిస్, కార్డియాలజీ, 2డి ఎకో వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వడ్డీరహిత రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి కోతలు లేకుండా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు.

రైతులు పంట మార్పుపై దృష్టి పెట్టాలని, వరి, మొక్కజొన్నలతో పాటు ఇతర పంటలను కూడా పండించాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం రైతులకు మద్దతు ఇస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహ జ్యోతి పథకం ద్వారా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, డైట్ చార్జీల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరా మహిళా శక్తి వడ్డీరహిత రుణాలు, రేషన్‌లో సన్నబియ్యం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు.ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వచ్చిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ప్రతి సోమవారం పురోగతికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు.మే 6న వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, సుమారు 100 కంపెనీలు పాల్గొని 2 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలుపై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ప్రస్తుతం కొనుగోలు వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. వేడి తీవ్రత కారణంగా హమాలి సమస్యలు ఉన్నప్పటికీ రైతులు సహకరించాలని, నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు.డీజిల్, పెట్రోల్ కొరతపై వస్తున్న వదంతులు అసత్యమని, జిల్లాలో తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ స్టాక్‌లను పర్యవేక్షిస్తూ, ప్రతి పెట్రోల్ బంక్‌పై నిఘా ఉంచినట్లు చెప్పారు. ప్రజలు అవసరానికి సరిపడా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లా రెడ్డి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్, ఆర్డీఓ బి. గంగయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడిపైకి గ్యాస్ మిస్సైల్

## వాణిజ్య ఎల్‌పీజీ ధర 5 నెలల్లో రూ.1,491 పెంపు

**న్యూఢిల్లీ :** కార్మిక దినోత్సవం రోజున ప్రజలకు కేంద్రంలోని మోదీ సర్కార్ ఊహించని గిఫ్ట్ ఇచ్చింది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ఎలా ఉన్నప్పటికీ ప్రజలపై ఎటువంటి ఇంధన భారం మోపబోమని ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు పదేపదే హామీ ఇచ్చిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఎన్నికలు ముగిసిన వెంటనే ప్లేట్ ఫిరాయించింది. ప్రజలపై గ్యాస్ పిడుగు వేసింది. దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు టిఫిన్ సెంటర్లు ఉపయోగించే వాణిజ్య సిలిండర్‌పై రికార్డు స్థాయిలో మోయలేని భారం మోపింది. 19 కిలోల సిలిండర్‌పై దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఒకేసారి రూ.993 పెంచేసింది. దీంతో ఢిల్లీలో దాని ధర రూ. 3,071.50కి చేరింది. అలాగే 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల ధరలను ఒక్కో బాటిల్‌కు రూ. 549 నుంచి రూ. 810.50కి పెంచింది. 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ (డొమెస్టిక్ ఎల్‌పీజీ) ధర ప్రస్తుతం రూ. 913 కాగా, 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధర దానికంటే కొంచెం తక్కువగా ఉంది. అలాగే టెలికం సిగ్నల్ టవర్లు వంటి పారిశ్రామిక వినియోగదారులు వాడే బల్క్ డీజిల్ ధర లీటరుకు రూ. 137 నుంచి రూ. 149కి పెరిగింది. పెట్రోల్ పంపుల వద్ద లభించే లీటరు డీజిల్ ధర రూ. 87.62తో పోలిస్తే ఈ ధరలు ఎక్కువ. అంతర్జాతీయ విమానయాన సంస్థల జెట్ ఇంధనం ధరను



కూడా ప్రభుత్వం భారీగా పెంచింది. వాణిజ్య ఎల్‌పీజీ ధర గడచిన 5 నెలల్లో రికార్డు స్థాయిలో రూ. 1,491 పెరిగింది. మార్చి 1 రూ. 28 పెంచగా మార్చి 7న రూ. 114.5 పెంచారు. తాజాగా రికార్డు స్థాయిలో రూ. 993 పెంచుతున్నట్లు ప్రభుత్వ అధీనంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ శుక్రవారం ప్రకటించింది. ఈ పెంపు వల్ల దేశవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, చిన్న టిఫిన్ సెంటర్ల నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభావం నేరుగా వినియోగదారుడిపై పడే అవకాశం అధికంగా ఉంది.

కాగా , విమానయాన సంస్థలు, వినియోగదారులను కాపాడేం దుకు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు పెరుగుతున్న ప్రపంచ ఇంధన ధరల భారాన్ని భరించాలని నిర్ణయించుకు న్నాయని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) తెలిపింది. పెట్రోల్, డీజిల్, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల రిటైల్ ధరలు స్థిరంగా ఉండగా అంతర్జాతీయ ధరల అస్థిరత నుండి వినియోగదారులను రక్షించడం, సాధారణ ప్రజలను ప్రభావితం చేసే కీలక ఇంధనాల ధరలలో ఎటువంటి సవరణ జరగలేదని ఐఓసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముడి సరుకుల ఖర్చుల ఆధారంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఏటీఎఫ్ ధరలను సవరిస్తారు.

### ఏటీఎఫ్ ధర 5% పెంపు

అంతర్జాతీయ విమానయాన సంస్థల జెట్ ఇంధన ధరలను 5 శాతం పెంచారు. వరుసగా ఇది రెండో నెల పెంపు. ప్రభుత్వ రంగ చమురు సంస్థల ప్రకారం భారత్‌లో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయానికి నిలయమైన ఢిల్లీలో అంతర్జాతీయ విమానయాన సంస్థలకు ఏటీఎఫ్ ధరలను కిలోలీటరుకు 76.55 డాలర్లు లేదా 5.33 శాతం పెంచి 511.86 డాలర్లకు చేర్చారు.

## దుబ్బాక ప్రజాపాలన కార్యక్రమంలో ఉద్రిక్తత

**దుబ్బాక :** శనివారం నాడు జరిగిన దుబ్బాక ప్రజాపాలన కార్యక్రమంలో ఉద్రిక్తత తలెత్తింది. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నిలదీసారు. కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతుండగా అధికారులు మైకులు కట్ చేసారు. దీంతో ఆగ్రహంతో ఎమ్మెల్యే మైకులను నేలకేసి కొట్టివేసారు. వడ్ల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని నేలపై కూర్చొని నిరసనకు దిగారు.

## స్నిఫర్ జాగిలం "సింధు" కోసం ఆధునిక కెన్నెల్‌శ్రీ ప్రారంభం.

**మహబూబ్నగర్ :** జిల్లా పోలీస్ శాఖలో స్నిఫర్ జాగిలం "సింధు" కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఆధునిక కెన్నెల్ జిల్లా ఎస్పీ డి.జానకి, శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రు మాట్లాడుతూ, నేర నియంత్రణలో స్నిఫర్ జాగిలాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేలుడు పదార్థాల గుర్తింపు, అనుమానాస్పద వస్తువుల పరిశీలన వంటి సందర్భాల్లో జాగిలాలు పోలీసులకు ఎంతో సహాయపడుతున్నాయని తెలిపారు. "సింధు" ఇప్పటికే శిక్షణ పొందిన నైపుణ్యంతో భద్రతా చర్యల్లో కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. సింధు కోసం ఏర్పాటు చేసిన ఈ కెన్నెల్ ను ఆధునిక సదుపాయాలతో నిర్మించామని, ఇందులో శుభ్రత, సరైన గాలి ప్రవాహం, విశ్రాంతి కోసం అనుకూల వాతావరణం, తాగునీరు మరియు శిక్షణకు అవసరమైన వసతులు కల్పించినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి డాగ్ స్క్వాడ్ (జాగిలాల దళం)ను అభివృద్ధి చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని శిక్షణ పొందిన జాగిలాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఔః రత్నం, ఒఖీ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఖీఎ లు కృష్ణయ్య, పోలీస్ అధికారులు, జాగిలాల దళం సిబ్బంది పాల్గొన్నారు.

## "సే నో టు డ్రగ్స్" ర్యాలీ

**హనుమకొండ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "సే నో టు డ్రగ్స్ " అంశంపై శనివారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హనుమకొండ అదాలత్ సర్కిల్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు సాగింది. ఈ ర్యాలీ ను వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ ఛాహాత్ బాజ్పాయ్ జెండా ఊపి ప్రారంభించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని సూచించారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డిడబ్ల్యుఓ విశ్వజ పోలీస్, ఎక్సైజ్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఈగల్ టీం, ఆశా వర్కర్లు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉమ్మడి రంగారెడ్డి బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్ భేటీ

**హైదరాబాద్ :** నంది నగర్ నివాసంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పార్టీ బలోపేతం, రానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, కమిటీల నిర్మాణం వంటి అంశాలపై చర్చ జరిగింది. తోపాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చ జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో (పంచాయతీ, మున్సిపల్) మంచి విజయాలు నమోదు చేసిన పార్టీ నేతలకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం కావాలన్న కేటీఆర్ సూచించారు.

## ఇవానా జువెల్స్ ప్రారంభం

**హైదరాబాద్ :** బంగారం వజ్రాభరణాల కలెక్షన్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని విక్కీ ఫ్లో చైర్ పర్సన్ శ్రీధర్ రెడ్డి అన్నారు హైదరాబాద్ సోమాజిగూడ రాజ్ భవన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇవానా జువెల్స్ షోరూమ్ ను నిర్వహణకులతో కలిసి ఆమె లాంచ్ చేశారు. ల్యాబ్-గ్రోన్ డైమండ్ జువెలరీకి ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని హైదరాబాదులో కొత్తగా మరో షో రూమ్ లో అందుబాటులోకి తీసుకురావడం అభినంద నీయమన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రధాన నగరాల్లో ఔట్లెట్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సూరత్కు చెందిన ప్రపంచ స్థాయి తయారీ నైపుణ్యమే పునాదిగా ఇవానా జువెల్స్ వారసత్వ హస్తకళకు, ఆధునిక సాంకేతికతకు మధ్య ఉన్న అంతరాన్ని విజయవంతంగా భర్తీ చేస్తుందని ఇవానా జువెల్స్ వ్యవస్థాపక సభ్యుడు యోగిత్ జిందాల్ పేర్కొన్నారు.

## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు.

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్.**

**హనుమకొండ :** మెడికల్ విద్యకు సంబంధించి రేపు జరిగే నీట్ ప్రవేశ సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్)అమలు చేయనున్నట్లు తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో( హన్మకొండ 04,వరంగల్ 02, కాజీపేట 3,జనగామ 2 వున్నాయి ) రేపు మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు. సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం.పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 03-05-26 ఉదయం 06:00 గంటల నుండి సాయంత్రం 06:00 గంటల వరకు మూసివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## వడదెబ్బపై అవగాహన శిబిరం

**హుజూర్ నగర్ :** లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హుజూర్నగర్-1 సబ్ సెంటర్ , గోవిందాపురంలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ చందన్ మరియు హెల్త్ అసిస్టెంట్ కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుతారి మరియు హమాలి కార్మికులకు వడదెబ్బపై అవగాహన కల్పించి వడదెబ్బ తగలకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు తెలియజేశారు. అలాగే వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ రక్షణ చర్యల గురించి వివరించారు. అదేవిధంగా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ప్రాముఖ్యతను వివరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకుని ఇంటికే పరిమితం అవ్వాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలను ధరించి గొడుగు టోపీ లేదా టవల్ లాంటి సాంప్రదాయ దుస్తులను తప్పకుండా ఉపయోగించాలని వివరించారు.

## 10వ తరగతిలో టాప్ సాధించిన విద్యార్థులకు ఘన సత్కారం


**రామచంద్రపురం/తెల్లాపూర్ :** తెల్లాపూర్ జడ్పీహెఎస్ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. భాస్కర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెరుగైన మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు టి. భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, పట్టుదల వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో చదువులు కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరి శంకర్, రాజేష్, నర్సింహులు, భూపాల్ రెడ్డి, మహేష్ పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. క్రమశిక్షణ, సమయపాలన, లక్ష్యసాధన వంటి విలువలను పాటిస్తే జీవితంలో మరింత విజయాలు సాధించవచ్చని వారు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల విజయాన్ని హర్షించారు.




## ఆకట్టుకుంటున్న 'సతీ లీలావతి' ట్రైలర్

మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. చాలా కాలం తర్వాత లావణ్య లీడ్ రోల్‌లో కనిపిస్తున్న ఈ చిత్రానికి 'భీమిలీ కబడ్డీ జట్టు', 'హమీ' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వం వహించారు. 'శాకుంతలం' ఫేమ్ మలయాళ నటుడు దేవ్ మోహన్ ఇందులో హీరోగా నటించగా, భార్యాభర్తల మధ్య జరిగే సరదా గొడవలు, ఎమోషన్స్‌ను మేళవించి ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా దీనిని తెరకెక్కించారు. ఈ సినిమాను మే 8, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ ముహూర్తం ఖరారు చేసింది.

## మైండ్ గేమ్‌తో వస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్.. ఆకట్టుకుంటున్న 'ఐ నోబడీ' టీజర్




మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం (ఐ, నోబడీ). 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.




## వరుస యాక్షన్ చిత్రాలతో గోపిచంద్ దూకుడు..

### మరో యాక్షన్ డ్రామాకి రెడీ..!

టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. కెరీర్‌లో మరోసారి జోరు పెంచిన ఆయన, కొత్త కథలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం ఆయన దర్శకుడు సంకల్ప్ రెడ్డి తెరకెక్కిస్తున్న 'భరతవర్ష' చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా దృశ్యాలకు మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో గోపీచంద్ తన రూపాన్ని పూర్తిగా మార్చుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే సమయంలో, నూతన దర్శకుడు కుమార్ సాయి తో మరో చిత్రానికి కూడా ఆయన అంగీకరించారు. ఈ సినిమా చిత్రీకరణలో ఎక్కువ భాగం విదేశాల్లో జరగనుంది. సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక తాజాగా గోపీచంద్ తన జాబితాలో మరో యాక్షన్ కథను చేర్చాడు. ప్రముఖ స్టంట్ మాస్టర్ వెంకట్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ సంగీతం అందించనున్నారు. పలువురు ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్టులో భాగమవుతున్నారు. ఈ కొత్త సినిమా ప్రారంభోత్సవం మే 3న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా జరగనుంది. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. ప్రస్తుతం చేతిలో ఉన్న చిత్రాలను పూర్తి చేసిన తర్వాత, గోపీచంద్ ఈ కొత్త యాక్షన్ చిత్ర షూటింగ్‌లో పాల్గొననున్నారు.

## 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు అద్భుతం.. ఆకట్టుకుంటున్న 'సింగ్ గీతం' టీజర్!




భారతీయ సినీ చరిత్రలో అద్భుత ప్రయోగాలు చేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, 94 ఏళ్ల వయసులో మళ్ళీ మెగాఫోన్ పట్టి సరికొత్త మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో నటించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'కల్కి 2898 ఏఐ' దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. టీజర్ చూస్తుంటే ఒక వైవిధ్యమైన కథాంశంతో, సంగీత ప్రాధాన్యత ఉన్న చిత్రంగా ఇది కనిపిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ (డిఎస్పీ) ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. జూన్ 11వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ వయసులో కూడా ఆయనలోని ఉత్సాహం చూసి సినీ ప్రముఖులు మరియు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

## తిరుపతి ఘటనపై రష్మీ ఆగ్రహం..

### ట్రోలింగ్‌పై గట్టి కౌంటర్ ఇచ్చిన జబర్దస్త్ యాంకరమ్మ



బుల్లితెర, వెండితెరపై తనదైన గుర్తింపు తెచ్చుకున్న రష్మీ గౌతమ్ మరోసారి జంతువులపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై తరచుగా స్పందించే రష్మీ, ముఖ్యంగా మూగజీవాల సంరక్షణ విషయంలో ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తిరుపతిలో జరిగిన ఒక ఘటనపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో డీజిల్ కొరత సమస్యపై నిరసనల నేపథ్యంలో తిరుపతిలో ఒక ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎద్దుల బండిపై ఆటోను, దానిపై కొంతమంది వ్యక్తులను ఎక్కించి ఎద్దులతో లాగించిన ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, రష్మీ గౌతమ్ తీవ్రంగా స్పందించారు. నిరసన పేరుతో మూగజీవాలపై ఇంత భారం మోపడం క్రూరత్వమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇలాంటి చర్యలు చేసే వారు తమ కర్మ ఫలితాన్ని అనుభవిస్తారు" అంటూ ఘాటుగా హెచ్చరించారు. అలాగే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రష్మీ వ్యాఖ్యలపై కొంతమంది సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. గతంలో ఆమె నటించిన సినిమాలను ప్రస్తావిస్తూ వ్యక్తిగత విమర్శలు చేశారు.

## ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు తీసుకోవడం తప్పు..

### టికెట్ రేట్లపై రవిబాబు సంచలన వ్యాఖ్యలు!



వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ ఈ చిత్రం మే 08న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచడం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.



## హారర్ థ్రిల్లర్‌గా నవీన్ చంద్ర 'పోలీస్ కంప్లైంట్'

వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర వంటి ప్రతిభావంతులైన నటీనటుల కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'పోలీస్ కంప్లైంట్' మే 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా హారర్ మరియు యాక్షన్ థ్రిల్లర్ అంశాల కలబోతగా రూపొందడం విశేషం. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ఇచ్చింది. చిత్రంలో కీలక పాత్ర పోషించిన నటుడు కృష్ణసాయి పుట్టినరోజును పురస్కరించుకుని, దివంగత సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ఒక ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించారు. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగుతూనే, ప్రేక్షకులకు వెన్నులో వణుకు పుట్టించే హారర్ ఎలిమెంట్స్ ఇందులో పుష్కలంగా ఉండబోతున్నాయి. గతంలో 'ఆదిపర్వం', 'రాఘవరెడ్డి', 'అఘోర' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్న సంజీవ్ మేగోటి, ఈసారి పోలీస్ కంప్లైంట్ సినిమాతో మరోసారి మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలోని ప్రధాన ఆకర్షణ నటీనటుల ఎంపిక. వరలక్ష్మి శరత్‌కుమార్ తన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో సరికొత్త షేడ్స్ చూపించనుండగా, వెర్సటైల్ హీరో నవీన్ చంద్ర ఒక విభిన్నమైన రోల్‌లో మెరవబోతున్నారు. వీరిద్దరి మధ్య సాగే డ్రామా సినిమాకు ప్రధాన బలంగా నిలవనుంది. కేవలం ప్రధాన జంట మాత్రమే కాకుండా, ఈ చిత్రంలో ఏకంగా 52 మంది సీనియర్ ఆర్టిస్టులు నటించడం విశేషం. రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్ వంటి అనుభవజ్ఞులైన నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. భారీ తారాగణం ఉండటం వల్ల సినిమాలోని ప్రతి సన్నివేశం చాలా గ్రాండ్‌గా, పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. సాంకేతిక పరంగా కూడా ఈ చిత్రం ఉన్నత ప్రమాణాలతో రూపొందింది. ముగ్గురు సంగీత దర్శకులు ఆరోహణ సుధీంద్ర, సంజీవ్ మేగోటి మరియు సుధాకర్ మారియో ఈ చిత్రానికి బాణీలు సమకూర్చగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాధ్యతను స్వయంగా దర్శకుడే తీసుకున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com